# పరలోక రాజ్యమర్మములు

## 1వ భాగం

"పరలోక రాజ్యం సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడి."


రచయిత

**జి. జాన్ తిమోతి**

అనువాదం

**డా. కె. ప్రసన్న కుమార్**



ప్రచురణ

**జి. జాన్ తిమోతి**

1/34, వళ్ళువార్ రోడ్, అరుంబాక్కం
చెన్నై - 600 106, ఇండియా
ఫోన్. 91 9884054741




**The Secrets of Kingdom of Heaven (Part-1)**
*By G.. John Timothy*

© The Author


Translated by Dr Prasanna Kumar Kaki with kind permission

First Telugu Edition - Aug.2009
3000 copies

*Published by*
**G. John Timothy**
1/34, Valluvar Road
Arumbakkam
CHENNAI - 600 106
Ph. 91 9884054741

# పరిచయం

దక్షిణ భారతదేశంలో గత 3 సంవత్సరాలుగా నా పరిచర్యలో చేసిన ప్రసంగాలనుండి ఈ గ్రంథం కూర్చబడింది. పరలోకరాజ్యం గురించిన ధ్యానాలను నాలుగు సంపుటిలుగా ముద్రించాలని నా హృదయవాంఛ. ఆ వరుసలో ఈ గ్రంథం మొదటిది. దేవుని చిత్తమైతే దీని తరువాత వరుసగా “పరలోకరాజ్య మర్మాలు”, “పరలోకరాజ్య ప్రత్యక్షత”, “పరలోకరాజ్య వాస్తవికత” అనే మూడు గ్రంథాలు ప్రచురించాలనే ప్రణాళిక కలిగి ఉన్నాం.

ప్రభువైన యేసు సిలువపై చేసిన అద్భుతమైన కార్యంపై ఆధారపడి, పరిశుద్ధాత్మ కార్యంద్వారా బయలుపరచబడిన దేవుని మహిమాన్వితమైన సమాలోచనలలోకి ప్రవేశించడానికి రచయితగా నేను చాలా అశక్తుణ్ణని గ్రహిస్తున్నాను. పరిశుద్ధాత్మ వెలుగు ద్వారా అందుకొన్న సత్యాన్ని స్పష్టంగా వ్యక్తీకరించడానికి మానవుని సామర్థ్యం ఏ మాత్రం సరిపోదు. అయితే సాధనం ఎంత బలహీనమైనదైనా పరిశుద్ధాత్మ దేవుడు తన సంకల్పాన్ని పూర్తిగా నెరవేర్చుకోగల సమర్థుడు అన్న సత్యం మనకు ఎంతైనా ఆదరణ కలిగిస్తుంది. ప్రభువు ఈ గ్రంథాన్ని దీన్ని చదివేవారందరికీ ఆశీర్వాదకారణంగా చేసి వారి జీవితాల్లో తన జీవాన్ని నింపాలని కోరుకుంటున్నాను.

**జి. జాన్ తిమోతి**



4 page blank



# పరలోకరాజ్యం మరియు దేవుని రాజ్యం

రాజ్యం గురించిన చర్చల్లో బైబిలు విద్యార్థులు సాధారణంగా “పరలోకరాజ్యం”, “దేవుని రాజ్యం” అనే రెండు పదాలను గూర్చి చదువుతారు. క్లుప్తంగా చెప్పాలంటే “పరలోకరాజ్యం” అనేది దేవుని వ్యవహార కాలక్రమానికి సంబంధించిన పదం (మత్తయి 3:2). “దేవుని రాజ్యం” అనేది ఒక నైతిక క్రమానికి సంబంధించిన పదం. “దేవుని వ్యవహార కాలక్రమం” అని అనడంలో నా ఉద్దేశం ఒక ప్రత్యేకమైన కాలపరిమితిలో ఈ భూమిపై దేవుడు మానవులతో వ్యవహరించటం అని. ఉదాహరణకు దేవుడు మోషే ధర్మశాస్త్రకాలంలో ఒక విధంగానూ, ఈ కృపాకాలంలో మరో విధంగానూ మానవులతో వ్యవహరిస్తున్నాడు. దేవుని రాజ్యం ‘నైతికక్రమ సంబంధమైన’ పదం అని చెప్పడంలో అది మన ప్రవర్తన, మన నడవడి, మన మార్గాలకు సంబంధించింది అని నా భావం.

## పరలోక రాజ్యం:

“పరలోక రాజ్యం” అనే పదం బైబిలు మొత్తంలో కేవలం మత్తయి సువార్తలోనే 33 సార్లు కనిపిస్తుంది. 3 నుండి 12 అధ్యాయాల వరకు అది పాత నిబంధనలో వాగ్దానం చేయబడిన రాజ్యం అని ప్రస్తావించబడింది. ఆ తరువాతి అధ్యాయాల్లో దానిని గురించి పూర్తిగా విభిన్నమైన స్వభావం కలదిగా ప్రస్తావించింది.

**పరలోకరాజ్యం గురించిన రెండు పదప్రయోగాలు:** ప్రజలు తనను తిరస్కరించిన కారణంగా రాజ్యం బహిరంగంగా ప్రత్యక్షమయ్యేవరకు ఒక నిగూఢదశగుండా పయనిస్తుందని ప్రభువు తన శిష్యులతో చెప్పాడు (మత్తయి 13:10-17). పాతనిబంధన ప్రవచనాల్లో చెప్పబడిన రాజ్యం యొక్క బహిరంగ

ప్రత్యక్షత కొంతకాలంపాటు అనిర్ణితంగా, అంటే వెయ్యేళ్ళ పరిపాలన వరకు వాయిదా వేయబడింది. ఆ దినం వరకు రాజ్యం ఒక నిగూఢమైన ఆకారంలో కొనసాగుతుంది. కాబట్టి పరలోక రాజ్యానికి వర్తమాన దశ మరియు భవిష్యత్ దశ అనేవి ఉన్నాయి. ఈ రెండు దశలకు ప్రత్యేకమైన ప్రారంభ సమయాలు ఉన్నాయి. ప్రభువైన యేసు పరలోకానికి ఎక్కిపోయినప్పుడు ఈ నిగూఢదశ ప్రారంభమైంది. లూకా సువార్త 19:11-12 దీనిని వివరిస్తున్నది, "వారు ఈ మాటలు వినుచుండగా తాను యెరూషలేమునకు సమీపమున ఉండుటవలనను, దేవుని రాజ్యము వెంటనే అగుపడునని వారు తలంచుటవలనను, ఆయన మరియొక ఉపమానము చెప్పెను. ఏమనగా రాజకుమారుడొక రాజ్యము సంపాదించుకొని మరల రావలెనని దూరదేశమునకు ప్రయాణమై...". ఇది ఆనాటి రోమా ప్రభుత్వ నిర్వహణాపద్ధతి నుండి తీసికొన్న ఒక సాదృశ్యం. దాని సమస్త మహిమా ప్రభావాల ప్రత్యక్షతతో కూడిన పరలోక రాజ్యం యొక్క ప్రారంభం క్రీస్తు ప్రత్యక్షమైన సమయమే (దానియేలు 2:35; 7:13-14; ప్రకటన 11:15). "పరలోకరాజ్యం" రెండు విధాలైన ప్రక్రియలగుండా పయనిస్తుంది. అవేమంటే నిగూఢమైన రాజ్యం (మత్తయి 13:11), ప్రత్యక్షతతో కూడిన రాజ్యం (1యోహాను 3:2). మరో విధంగా చూస్తే ప్రస్తుత రాజ్యం సహనంతో కూడింది (ప్రకటన 1:9), భవిష్యత్తులో వచ్చే రాజ్యం శక్తితో కూడింది (మార్కు 9:1). శక్తితో కూడిన రాజ్యం అంటే అది "రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావముతో కూడినది" (హెబ్రీ 6:5). "పరలోకరాజ్యం" అని బైబిలులో మొత్తం 33 సార్లు ప్రస్తావించబడగా 24 సార్లు అది నిగూఢమైన రాజ్యం అనే అర్థంలోనూ, 9 సార్లు ప్రత్యక్షతతో కూడిన రాజ్యం అనే భావంలోనూ వాడారు.

**పరలోకరాజ్యం యొక్క ప్రస్తుత స్థితి:** పైన చెప్పినట్లుగా ప్రస్తుత కాలంలో రాజ్యం నిగూఢమైన లక్షణం కలిగి ఉంది. ఎలాగంటే అసలు ప్రస్తుతం రాజ్య నిర్వహణ అనేది లేనట్లుగా ఉంది. బాహ్యంగా చూస్తుంటే అసలు దేవుడు అధికారంలో ఏమాత్రం లేనట్లుగానే అనిపిస్తుంది. అయితే విశ్వాసం మాత్రం రాజు తన సింహాసనంపై ఆశీనుడుగా ఉన్నట్లుగానే దృష్టిస్తుంది. ఆ రాజ్యానికి చెందినవారంగా మనం ఆయన వాక్యంలోని పర్వతప్రసంగంలో చెప్పిన సూత్రాలకు అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంటుంది (మత్తయి 5-7).



రాజ్యం ప్రస్తుతం నిగూఢమైన, మార్మికమైన విధంగా ఉంది. ఎందుకంటే,

- రాజ్యానికి పైకి కనిపించే విధంగా ఒక రాజు లేడు.
- భౌగోళిక పరంగా ఈ భూమికి సంబంధించినంతవరకు దానికి ఒక ముఖ్యపట్టణం లేదు.
- దానికి భౌగోళిక సరిహద్దులు లేవు.
- దానికి చెందినవారమని చెప్పుకొనే వారెవరూ ఆయన అధికారానికి లోబడి ఉన్నట్లుగా ప్రవర్తించడంలేదు. వారికి రాజు అనే వాడెవడూ లేడన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు.

## నిగూఢమైన పరలోకరాజ్యం గురించిన ఆరు పోలికలు:

ప్రస్తుత కాలంలో రాజు కనిపించని పరలోకరాజ్యం యొక్క వర్ణనను ప్రభువు మత్తయి సువార్త 13 వ అధ్యాయంనుండి కొన్ని పోలికల ద్వారా వివరించాడు.

ఈ ఆరు పోలికలను రెండు విభాగాలుగా విభజించవచ్చు. మొదటి విభాగం (1-3) రాజ్యంలో ప్రస్తుతం సాతాను చేస్తున్న పని గురించి, రెండవ విభాగం (4-6) రాజ్యంలో దేవుడు చేస్తున్న పని గురించీ వివరిస్తున్నాయి.

## రాజ్యంలో సాతాను చేస్తున్న పని:

మొదటి విభాగం మానవుని చేతిలోని రాజ్యం గురించిన బాహ్యస్వరూపాన్ని వివరిస్తున్నది. రాజ్యంలోకి దూరి, దానిని పతనం చేసే శత్రువుయొక్క పనిని అది వర్ణిస్తున్నది.

**మొదటి ఉపమానం:** గోదుమల మధ్య గురుగులు (మత్తయి 13:24-30; 37-43).

**రెండవ ఉపమానం:** పెద్ద వృక్షంపైని పక్షులు (13:31-32).

**మూడవ ఉపమానం:** మూడు కుంచముల పిండిలో దాచిపెట్టిన పుల్లని పిండి (మత్తయి 13:33).

క్రైస్తవ విశ్వాసపుటొప్పుకోలులోని లోకసంబంధమైన శక్తి యొక్క గొప్ప బహిరంగ వెల్లడింపు రెండవ ఉపమానంలో కనిపిస్తుంది. దాని సిద్ధాంతాలు,

అనుసరణలలో అంతర్గతంగా ఉన్న చెడిపోయిన స్థితిని మూడవ ఉపమానంలో చూస్తాం.

**రాజ్యంలో సాతాను చేసే పని:**

- ❑ దుష్టులైన వ్యక్తులను దానిలో చొప్పించడం ("గురుగులు")
- ❑ దుష్టాత్మలను దానిలో ప్రవేశింపజేయటం ("పక్షులు")
- ❑ చెడు సిద్ధాంతాలను వ్యాపింపచేయటం ("పుల్లని పిండి")

## రాజ్యంలో దేవుడు చేస్తున్న పని:

మొదటి విభాగం మానవుని చేతిలోని రాజ్యం గురించిన కొన్ని పోలికలు మనకు వివరించింది. రెండవ విభాగం దేవుని సంకల్పానుసారమైన రాజ్యం గురించిన ఒక దైవిక దృక్పథం కలిగి ఉంది. దానిలో శత్రువుయొక్క పన్నాగాలను నిర్వీర్యం చేస్తూ క్రీస్తుకొరకు ఆత్మలను సంపాదించి భద్రపరిచే దేవుని సార్వభౌమత్వాన్ని మనం గుర్తించగలం.

**నాల్గవ ఉపమానం:** పొలములో దాచబడిన ధనం (మత్తయి 13:44)
**ఐదవ ఉపమానం:** అమూల్యమైన ఒక ముత్యము (మత్తయి 13:45-46)
**ఆరవ ఉపమానం:** చేపల వల (మత్తయి 13:47-50)

**క్లుప్తంగా రాజ్యంలో దేవుడు చేస్తున్న పని:**

- ❑ యూదులను తనకొరకు పోగుచేసుకోవడం ("ధనము")
- ❑ క్రైస్తవ సమాజాన్ని పిలుస్తున్నాడు (మంచి ముత్యము).

*గమనిక:* కొత్త నిబంధనలో "సంఘం" అనే మాట మూలంలో లేదు. దానిని "సమాజం" (Assembly) అని అనువదించాలి. జేమ్స్ అనే రాజు దానిని "సంఘం" అని పిలవాలని ఆజ్ఞాపించాడు. కాబట్టి ఈ పాఠమంతటిలో మనం "సంఘం" (Church) అనే మాటకు బదులుగా "సమాజం" (Assembly) అని చదువుతాం.

- ❑ నిత్యసువార్త ద్వారా అన్యజనులను రక్షించడం ("వల")

మత్తయి 13లో చెప్పబడిన శాస్త్రి గురించిన మరొక ఉపమానంలో పైన చెప్పిన ఏడు ఉపమానాల గురించి (విత్తువాని ఉపమానంతో సహా) మన బాధ్యత



ఏమిటి అన్నది వివరించబడింది. ఒక శాస్త్రిలాగా మనం ఈ ఉపమానాల గురించి చదివి, నేర్చుకొని, లోబడి, వాటిని గూర్చి గ్రంథస్థం చేసి వాటిలో నిక్షిప్తమై ఉన్న లోతైన భావాలను కాపాడాలి.

**రాజ్యానికి, సమాజానికి గల తేడా:** చాలామంది మంచి క్రైస్తవులు సహితం రాజ్యం, సమాజం అనే రెండు పదాల విషయంలో తికమక చెందుతారు. "సంఘ రాజ్యం" అని మనం కొన్నిచోట్ల చదువుతాం. అయితే "పరలోకరాజ్యం" అనేది సమాజం అనే పదానికి సమాంతరం కాదని ఈ క్రింది కారణాలను బట్టి చెప్పవచ్చు.

**మొదటి కారణం:** నిగూఢంగా ఉన్న పరలోక రాజ్యం ఈ భూమిపైన సమాజాలు నిలిచి ఉండే కాలంకంటే ఎక్కువ కాలంపాటు విస్తరించి ఉంది. సమాజం ప్రారంభానికి 10 రోజుల ముందునుండి, అనగా ప్రభువు తిరిగి పరలోకానికి ఎక్కిపోయిన దినం నుండి అది ఉనికిలోకి వచ్చింది (లూకా 19:12; అపో.కా.1:9-10). క్రైస్తవ సమాజం పరలోకానికి ఎత్తబడిన (సంఘారోహణం) తరువాత కూడా అంటే ఏడు సంవత్సరాల మహా శ్రమల కాలం పూర్తయ్యేవరకు పరలోకరాజ్యం ఉంటుంది.

**రెండవ కారణం:** పరలోక రాజ్యం యొక్క విస్తీర్ణం కూడా సమాజంకంటే అధికమైంది. మనం చూసినట్లు ప్రస్తుత కాలంలో రాజ్యంలో "గురుగులు" (కేవలం బాహ్యంగా చెప్పుకునేవారు), గోదుమలు (నిజమైన విశ్వాసులు) ఉండగా సమాజంలో మాత్రం కేవలం నిజమైన విశ్వాసులు మాత్రమే ఉంటారు. ఒక స్థానిక సమాజంలో లేక శాఖలో అనేకమంది చేరి వాటి సభ్యుల పట్టీలో చోటు సంపాదించుకోవచ్చు గాని, రక్షణ పొంది ఉండకపోతే వారు "దేవుని సమాజానికి" చెందినవారు కారు (అపో.కా. 20:28).

**మూడవ కారణం:** క్రీస్తు పరలోక రాజ్యానికి రాజుగాని ఆయన సమాజానికి రాజు కాడు. సమాజానికి క్రీస్తు శిరస్సుగా ఉన్నాడు.

**నాల్గవ కారణం:** సమాజపు సహవాసంలో ఎవరిలోనైతే పులిసిన పిండి కనిపిస్తుందో ఆ వ్యక్తులను సమాజంలోనుండి వెలివేయడం ద్వారా పులిపిండిని తీసివేయాలి (1కొరింథీ 5:11-13). నిగూఢమైన పరలోకరాజ్యంలోనైతే దుష్టత్వం జరిగించేవారు, పులిసిన పిండి తీసివేయబడలేదు గాని పంటకోత కాలం వరకు వారిని కొనసాగనిచ్చారు (మత్తయి 13:28-29).

**ఐదవ కారణం:** మత్తయి 16:19లో "పరలోక రాజ్యపు తాళపు చెవులు'' పేతురుకు ఇవ్వబడ్డాయని ఉంది. ఇక్కడ చెప్పబడినవి సమాజపు తాళపు చెవులు కావు, పరలోక రాజ్యపు తాళపు చెవులు మాత్రమే. బాప్తిస్మం, శిష్యత్వాలే పరలోక రాజ్యపు తాళపుచెవులు. ఈ రెంటిద్వారా ఎవరైనా బహిరంగంగా పరలోకరాజ్యంలో ప్రవేశించగలరు. అయితే ఒక వ్యక్తి వాస్తవంగా ప్రవేశించాలంటే అతడు మారుమనస్సుద్వారా దేవునిలోకి క్రొత్తగా జన్మించాలి (యోహాను 3:5; మత్తయి 18:3).

**ఆరవ కారణం:** లేఖనాల్లో సమాజం అనేది రాజ్యంతో ఎక్కడా కలిపి చెప్పలేదు. అసెంబ్లీ లేక సమాజం ఒక ఇంటితో (1తిమోతి 3:15), ఒక దేవాలయంతో (1కొరింథీ 3:16,17), ఒక శరీరంతో (1కొరింథీ 12:27-31) పోల్చబడింది గాని ఎప్పుడూ ఒక రాజ్యంతో పోల్చబడలేదు. క్రీస్తు తన అసెంబ్లీకి లేక సమాజానికి శిరస్సుగా చెప్పబడ్డాడు (ఎఫెసీ 1:22; 4:15; కొలస్సీ 1:18) గాని ఎన్నడూ దాని రాజు అని చెప్పబడలేదు.

**పరలోకరాజ్యం శక్తి ప్రభావాలతో స్థాపించబడింది:** మనం ముందుగా చెప్పుకున్నట్లు క్రీస్తు ప్రత్యక్షం కావడంతో (దానియేలు 2:31-35; 7:13-14; ప్రకటన 11:15) "పరలోక రాజ్యం'' తన నిగూఢమైన స్థితినుండి ప్రత్యక్షతా స్థితిలోకి ప్రవేశిస్తుంది. అది మహా శక్తితోను, తీర్పుతోను ప్రత్యక్షమౌతుంది. ప్రతి ఒక్కరూ వెయ్యేళ్ళ పాలనా కాలంలో ఉండే ఆదర్శవంతమైన పరిస్థితులమధ్య జీవించాలని, అలాంటి జీవన శైలి ఈ భూమిపైకి రావాలని కోరుకుంటారు. అయితే దేవుడు దానిని ఈ భూమిపైకి తేవాలంటే అది ఆయన తీర్పు ద్వారానే సాధ్యమవుతుందని కొద్దిమంది మాత్రమే గ్రహించగలరు. తీర్పుద్వారా ఒక నీతిమంతమైన పరిపాలన ఈ భూమిపై స్థాపించబడుతుంది. "నీ తీర్పు లోకమునకు రాగా లోకనివాసులు నీతిని నేర్చుకొందురు'' (యెషయా 26:9).

మహా శక్తితో తన రాజ్యాన్ని స్థాపించేటప్పుడు దేవుడు ముందుగా దానిలో అనేక సంవత్సరాలుగా ఉనికిలో ఉన్న మిశ్రమ జనాంగాన్ని కడిగి శుభ్రం చేస్తాడు. మత్తయి 13:40-43 లో చెప్పినట్లు "గురుగులు ఏలాగు కూర్చబడి అగ్నిలో కాల్చివేయబడునో ఆలాగే యుగసమాప్తియందు జరుగును. మనుష్య కుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములోనుండి



ఆటంకములగు సకలమైన వాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు. చెవులు గలవాడు వినునుగాక.''

మత్తయి 24:40-41లో ప్రభువు దూతలు చేసే ఈ పనిని "ఆ కాలమున ఇద్దరు పొలములో ఉందురు, ఒకడు తీసికొని పోబడును, ఒకడు విడిచిపెట్ట బడును. ఇద్దరు స్త్రీలు తిరుగలి విసరుచుందురు. ఒకతె తీసికొనిపోబడును, ఒకతె విడిచిపెట్టబడును.'' అని వివరించాడు. ఈ సమయంలో తీర్పు ద్వారా ఈ లోకంనుండి వేరుచేయబడినవారు విశ్వాసులు కారు, వారు కేవలం బాహ్యంగా పైపై విశ్వాసం ప్రకటించి, వాస్తవానికి దేవుని కృపాసువార్తను తిరస్కరించినవారు. ఈ వర్గంలో మొట్టమొదట అగ్నిగుండంలోకి పడద్రోయబడేవారు మృగము, అబద్ధప్రవక్తలు - అంత్యక్రీస్తు (ప్రకటన 19:20). మిగిలినవారు ఈ భూమిపై ప్రత్యక్షతలోకి వచ్చిన రాజ్యంలో ప్రవేశిస్తారు. వీరు క్రైస్తవులు కారు (ఎందుకంటే అప్పటికి క్రైస్తవులంతా ఆరోహణం సమయంలో ఈ భూమిపైనుండి పరలోకానికి కొనిపోబడ్డారు). వీరు అప్పటివరకు దేవుని కృపాసువార్తను విననివారు, దానిని విన్నప్పటికీ దానిని తిరస్కరించనివారు. రాజ్యంలో ప్రవేశించడానికి వారికి కూడా ఒక అవకాశం ఇవ్వబడుతుంది.

**మహా శక్తితో ప్రత్యక్షమైన పరలోక రాజ్యానికి చెందిన రెండు విభాగాలు:** మత్తయి 13:40-43లో రాజ్యం గురించి రెండు నూతనమైన గమనించదగిన పదాలు మనం చూస్తాం. అవి "ఆయన రాజ్యము'' (మనుష్యకుమారుని రాజ్యం), "తమ తండ్రి రాజ్యము.'' ఈ రెండు పదాలు పరలోక రాజ్యం ప్రత్యక్షమైనప్పుడు దానిలో ఉండే రెండు విభాగాలను సూచిస్తున్నాయి. మనుష్యకుమారుని రాజ్యం ఈ భూమికి చెందినది (మత్తయి 13:41; 16:28; 19:28; 20:21; లూకా 22:30; 23:42; 2తిమోతి 4:1; హెబ్రీ 1:8; ప్రకటన 3:21; 20:4) తమ తండ్రి రాజ్యము అనేది పరలోకానికి చెందినది (మత్తయి 6:10; 13:43; 26:29; 1థెస్స 2:12; కొలస్సీ 1:13; హెబ్రీ 12:28). క్రీస్తు బహిరంగంగా పరిపాలించేటప్పుడు అక్కడ రెండు రాజ్యాలున్నాయని కాదు గాని ఒకే రాజ్యంలోని రెండు భాగాలు అని మనం గ్రహించాలి.

"సూర్యుడు'' ఆకాశమండలానికి చెందినది కాబట్టి అది రాజ్యపు పరలోక విభాగాన్ని సూచిస్తున్నది. ఇక్కడ సూర్యునివలె తేజరిల్లే నీతిమంతులు అని చెప్పబడ్డవారు దేవదూతలు దుష్టులను తీర్పుకొరకు తీసికెళ్ళిన తరువాత ఈ భూమిపై మిగిలిపోయినవారు కాదు. ఎవరైతే "కొట్టులో"కి చేర్చబడ్డారో వారే వీరు (మత్తయి 13:30). అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు మరియు ప్రవక్తలు (పాత నిబంధన పరిశుద్ధులు) అంతా ఈ పరలోక రాజ్యంలోని పరసంబంధమైన భాగంలో ఉంటారు (మత్తయి 8:11; లూకా 13:28).

## దేవుని రాజ్యం:

ఇప్పుడు మనం ''దేవుని రాజ్యం'' గురించిన కొన్ని విశేషాలు తెలుసుకుందాం. మనం ప్రారంభంలో చదివినట్లుగా "పరలోక రాజ్యం దైవ వ్యవహార కాలానికి సంబంధించిన పదమైతే, దేవుని రాజ్యం ఒక నైతిక లేక సదాచార పదం. అది మానవుల మధ్య దేవుడు స్థాపించాలని కోరుకున్న ఒక నైతిక స్థితితో ముడిపడి ఉంది. దీనినే మరో విధంగా చెప్పుకుంటే "పరలోక రాజ్యం'' మనం దేని "క్రింద'' లేక ఏ అధికారం క్రింద నివసిస్తున్నామని చెప్తున్నామో ఆ అధికార పరిధి అయితే దేవుని రాజ్యం మన "లో" ఉండాల్సిన నైతిక క్రమం అని చెప్పవచ్చు. కాబట్టి దేవుని రాజ్యం గురించి ఆలోచించేటప్పుడు మనం దానిని పరలోక రాజ్యంతో కలిపి చూడకూడదు. ఉదాహరణకు దేవుని రాజ్యం ఎప్పుడు ప్రారంభమైంది, అది ఎంతకాలం నిలిచి ఉంటుంది అని ప్రశ్నించుకోవాల్సిన అవసరతే లేదు. అధికార పరిధి, కాలపరిమితి వంటివాటితో దానికి సంబంధం లేదు. ఈ నైతిక క్రమం వారు యూదులైనా, క్రైస్తవులైనా, వెయ్యేళ్ళ పాలనాకాలానికి చెందిన వారెవరైనా సరే, ప్రతి యుగంలోని దేవుని పరిశుద్ధులకు సంబంధించినది.

దీనిపై ధ్యానంకొరకు రోమా 14:17 చూద్దాం, "దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని నీతియు, సమాధానమును పరిశుద్ధాత్మ యందలి ఆనందమునై యున్నది.'' కాబట్టి ఇది మత సంబంధమైన ఆచార వ్యవహారాలు (భోజనము, పానము) కాక దేవుడు మనలో స్థాపించాలని కోరుతున్న నైతికమైన విషయాలకు (నీతి, సమాధానము, ఆనందము) సంబంధించిన విషయం. అది మన వైఖరి, మన నడక, మన మార్గాలకు చెందిన నైతిక సూత్రాలకు చెందినది.



"దేవుని రాజ్యమెప్పుడు వచ్చునని పరిసయ్యులు ఆయన నడిగినప్పుడు ఆయన- దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది గనుక, ఇది ఇక్కడనని, అది అక్కడనని చెప్ప వీలుపడదని వారికి ఉత్తరమిచ్చెను.'' (లూకా 17:20-21). ఇక్కడ మనం సామాన్యంగా ఆలోచించే విధంగా ప్రజలు కూడా దేవుని రాజ్యం, పరలోక రాజ్యం ఒక్కటే అని భావిస్తున్నట్లు తెలుస్తున్నది. దేవుని రాజ్యం యొక్క ఏదో ఒక బహిరంగ ప్రత్యక్షతను వారు ఎదురుచూస్తున్నారు. తరువాతి వచనాల్లో మనుష్యకుమారుడు వివరించినట్లు దేవుడు వచ్చినప్పుడు రాజ్యం మహా శక్తితో బహిరంగంగా ప్రత్యక్షతలోకి వస్తుంది. అయితే దేవుని రాజ్యం అప్పటికే వారిమధ్య ఉంది. నాటి ప్రజల మధ్య నివసించి నడిచిన ప్రభువైన యేసు జీవితంలో అది సుస్పష్టంగా వెల్లడి అయ్యింది. దేవుని రాజ్యం యొక్క నైతిక లక్షణాలన్నీ ఆయన నడవడిలో, ఆయన మార్గాల్లో సంపూర్ణంగా బయలు పరచబడ్డాయి.

అపొస్తలుడైన పౌలు "అయితే దేవుని కృపాసువార్తను గూర్చి సాక్ష్యమిచ్చుట యందు నా పరుగును, నేను ప్రభువైన యేసువలన పొందిన పరిచర్యను, తుదముట్టించవలెనని నా ప్రాణమును నాకెంతమాత్రమును ప్రియమైనవిగా ఎంచుకొనుటలేదు. ఇదిగో దేవుని రాజ్యమును గూర్చి ప్రకటించుచు నేను మీ మధ్యను సంచరించుచుంటిని; మీలో ఎవరును ఇకమీదట నా ముఖము చూడరని నాకిప్పుడు తెలియును. కాబట్టి మీలో ఎవరి నాశనము విషయమైనను నేను దోషిని కానని నేడు మిమ్మును సాక్ష్యము పెట్టుచున్నాను. దేవుని సంకల్పమంతయు మీకు తెలుపకుండ నేనేమియు దాచుకొనలేదు'' (అపొ.కా.20:24-27) అని తన పరిచర్యను గురించి రాస్తున్నాడు.

దీనిలో పౌలు బోధలోని క్రమం గురించి మూడు పదాలను గమనించ వచ్చు. అది మన జీవితాల్లో దేవుని రాజ్యం యొక్క స్థానం సరిగా అర్థం చేసుకోడానికి తోడ్పడుతుంది. ప్రజలు దేవుని కృపాసువార్తను అంగీకరించి రక్షింపబడిన తరువాత పౌలు వారికి దేవుని రాజ్యం గురించి బోధించాడు, ఆ తరువాత అతడు వారికి దేవుని సంకల్పమంతా వివరించి చెప్పాడు.

దీనివలన ప్రజలు సువార్తను అంగీకరించిన తరువాత వారి జీవితాల్లో ఒక నైతిక క్రమం ఏర్పడాల్సి అవసరం ఉందని తెలుస్తుంది. దేవుని రాజ్యంలో

నిందారహితంగా నడుచుకోవడం ఎలాగో వారికి బోధించాల్సిన ఆవశ్యకత ఉంది. అది జరిగిన తరువాత మాత్రమే వారు క్రీస్తును గురించీ, ఆయన సమాజం లేక అసెంబ్లీ గురించీ దేవుని సంకల్పం ఏమిటో గ్రహించి మేలు పొంద గలుగుతారు. ఒక వ్యక్తి నూతనజన్మ ద్వారానే దేవుని రాజ్యంలోకి ప్రవేశిస్తాడు. "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5) అని ప్రభువు చెప్పాడు. దేవుని రాజ్యంలో ఉండాల్సిన నైతిక జీవనంకోసం ఒక వ్యక్తిని బలోపేతం చేసేది ఇదే. ఒక నూతన స్వభావం కలిగి (నూతనజన్మ ద్వారా) రాజ్య ప్రమాణాలను పాటించడం. ఒక విధంగా దేవుని రాజ్యం కూడా శక్తితో కూడింది - అయితే ఆ శక్తి నైతికమైనది. ఉదాహరణకు కొరింథీయులను మారుమనస్సుకు పురికొల్పడానికి పౌలు తన మాటల్లోని నైతిక శక్తిపై ఆధారపడ్డాడు (1కొరింథీ 4:20).

**రెండు పదాల మధ్య పోలిక:** సమరూపక గ్రంథాలైన మత్తయి, మార్కు, లూకా సువార్తల్లో "పరలోక రాజ్యం", "దేవుని రాజ్యం" అనే పదాలను ఒకదానికి బదులుగా మరొకటి వాడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే అవి వైరుధ్యాలు కావు. అవి రాజ్యానికి చెందిన రెండు విభిన్నమైన అంశాలను ప్రస్తావిస్తున్నాయి. ఒకటి దైవ వ్యవహార కాలంపై దృష్టి సారిస్తే మరొకటి నైతికతపై దృష్టి సారించింది.

ఉదాహరణకు, మత్తయి 10:7లో ప్రభువు తన శిష్యులను "పరలోక రాజ్యం" గురించి బోధించడానికి పంపించాడని ఉంటే, లూకా 9:2లో మాత్రం ఆయన వారిని "దేవుని రాజ్యం" గురించి బోధించడానికి పంపించాడని ఉంది. ఈ రెంటినీ కలిపి చూస్తే వారి సందేశం ఈ రెండింటినీ గూర్చినదని అర్థమవుతున్నది. శక్తితో ప్రత్యక్షం కాబోయే ఒక భౌతిక రాజ్యం యొక్క దైవ వ్యవహార కాలక్రమం గురించీ, ఆ రాజ్యంలో నివసించేవారికి ఉండాల్సిన నైతిక క్రమం గురించీ కూడా వారు ప్రకటించారు. "పరలోక రాజ్యం", "దేవుని రాజ్యం", ఈ రెండింటి విషయంలోనూ మర్మాలు దాగి ఉన్నాయని కూడా ప్రభువు చెప్పాడు (మత్తయి 13:11; లూకా 8:10). దీని అర్థం రాజ్యం విషయంలో దైవ వ్యవహార కాల మర్మాలు, నైతిక క్రమం గురించిన మర్మాలు కూడా ఉన్నాయి అని. పరలోక రాజ్యం గురించిన మర్మాలు ప్రస్తుతం ఉన్నట్లుగా బాహ్యంగా



కనిపించే ఒక రాజు, ఒక ముఖ్య పాలనాస్థలం, జాతీయ భౌగోళిక సరిహద్దులు లేని రాజ్య పరిపాలనా క్రమానికి చెందినవి. ఇక లూకా సువార్తలో స్వయం పరిశీలన, సహవాసాల ద్వారా ఒకని ఆత్మ స్థితి యొక్క నిర్వహణ గురించి, అంటే ఒక వ్యక్తి నైతికంగా ఏ విధంగా నడుచుకోవాలో అన్న మర్మాలు వెల్లడిచేయబడ్డాయి. ఈ రెండు పదాల మధ్య వింతైన తేడా మనకు ఆవగింజ ఉపమానం, మూడు కుంచముల పిండిలో దాచబడిన పుల్లనిపిండి ఉపమానాల్లో కనిపిస్తుంది. మత్తయి 13:31-32లో పెద్ద వృక్షం కాలగమనంలో క్రైస్తవ్యం భాగంగా ఉన్న రాజకీయ, వ్యాపారపరమైన ఈ గొప్ప ప్రపంచ వ్యవస్థను సూచిస్తుంది. అదే లూకా 13:18-19 లో అయితే ఆ పెద్ద వృక్షం తన నీతిమత్వాన్ని, నైతికతను చాటుతున్నట్లు నటించినా నిజానికి అది వేషధారణతో కూడినది.

అదే విధంగా మత్తయి 13:33 లోని మూడు కుంచముల పిండిలో ఉంచిన పుల్లని పిండి కపట సహోదరులు ప్రవేశించి చెడు సిద్ధాంతాలతో సమాజాన్ని కలుషితం చేయడాన్ని, లూకా 13:20-21 లోనైతే చెడు లేక దుష్టాచారాలను సమాజంలో ప్రవేశపెట్టడాన్ని సూచిస్తున్నాయి.

**ముగింపు మాటలు:** వెయ్యేళ్ళ పాలన తరువాత 'అంతం' లో ప్రభువైన యేసు రాజ్యాన్ని తండ్రియైన దేవునికి అప్పగిస్తాడు (1కొరింథీ 15:24-28). దానినాయన దేవునినుండే తీసుకున్నాడు, తిరిగి దానిని మరింత మహిమను జోడించి ఆయనకే అప్పగించాడు. చరిత్రలో ప్రతి ప్రభుత్వమూ దానికియ్యబడిన అధికారాన్ని సక్రమంగా నిర్వహించడంలో విఫలమైపోయింది. ఆదాము, దావీదు, సొలొమోను లేక మరింకెవరైనా అన్యరాజు సహితం దానిని నెరవేర్చలేకపోయారు. ప్రభువు రాజ్యాన్ని అందుకున్న సమయానికి "శత్రువులంతా" లోబడకపోయినా, అంతంలో ఆయన దానిని తిరిగి తండ్రికి అప్పగించేనాటికి ఆయన శత్రువులంతా ఆయన అధికారానికి లోబడతారు. దీనినిబట్టే ఆయన ఏ ఇతర అధికారులకంటే ప్రత్యేకమైనవాడిగా, అంటే రాజులకు రాజుగా, ప్రభువులకు ప్రభువుగా (ప్రకటన 19:16) పిలువబడ్డాడు. అంతంలో ఆయన రాజ్యాన్ని తండ్రియైన దేవునికి అప్పగించి తన ప్రథమ ఆకర్షణ అయిన సంఘమనే పెండ్లికుమార్తెకు తన సమయమంతా కేటాయిస్తాడు.

# పరలోక రాజ్యం - ఉపోద్ఘాతం

మత్తయి 13 అధ్యాయం పరలోక రాజ్య మర్మాల గురించి వ్రాయబడింది. దీనిలో 8 ఉపమానాలున్నాయి. ఈ పరలోక రాజ్య మర్మం గురించి మరింత లోతుగా చర్చించే ముందుగా ప్రఖ్యాత రచయితలు ఈ అధ్యాయం గురించి ఏం చెప్పారో చూద్దాం.

"ఇది బైబిల్లో అత్యంత ప్రాముఖ్యమైన అధ్యాయం. ప్రతి ఒక్క విశ్వాసి దీన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి."
- వారెన్ డబ్ల్యు వియర్స్‌బి

"లేఖనాల్లో అత్యంత విస్తారంగా వాడబడి అతి తక్కువగా అర్థం చేసుకో బడిన పదం పరలోక రాజ్యం."
- ఎఫ్. డబ్ల్యు గ్రాంట్

దేవుని రాజ్యం అంటే ఏమిటి? సామాన్యమైన భావంలో దేవుని సంకల్పాలను నెరవేర్చడం కోసం దేవుని ఆధీనంలో ఉన్న ఒక రాజ్యం. ఈ పదాన్ని అర్థం చేసుకోవడంలో ఒకదానితో మరొకటి సంబంధం కలిగి ఉన్న మూడు అంశాలను మనం పరిశీలించాలి.

### 1. పాలించే హక్కు:

ఆ రాజ్యాన్ని పాలించడానికి ఒక రాజు లేక ఒక వ్యక్తి చేతిలో ఉంచబడిన అధికారం లేక సార్వభౌమాధిపత్యం.

ఈ భావన లూకా 19:11-27 లో క్రీస్తు చెప్పిన ఉపమానంలో స్పష్టంగా కనబడుతున్నది. ముఖ్యంగా 12 వ వచనంలో "రాజకుమారుడొక రాజ్యము సంపాదించుకొని మరల రావలెనని దూరదేశమునకు ప్రయాణమై..." అనే మాటల్లో ఇది మనకు కనిపిస్తుంది. ఇదే భావం ప్రకటన 17:12 లోని "నీవు చూచిన ఆ పది కొమ్ములు పదిమంది రాజులు. వారిదివరకు రాజ్యమును పొందలేదు గాని యొకగడియ క్రూరమృగముతో కూడ రాజులవలె అధికారము పొందుదురు" అనే మాటల్లో కూడా దీన్ని చూస్తాం. ఈ వచనాల్లో రాజ్యము, అధికారము అనే రెండు పదాలు పర్యాయపదాలుగా ఉపయోగించడం మనం గమనించాలి. "... పదిమంది రాజులు ...రాజులవలె అధికారము పొందుదురు."

### 2. పరిపాలనా విస్తీర్ణం:

రెండవ భావన పాలనాధికారం నిర్వహించబడే ప్రదేశం. ఇది ఆధిపత్యాన్ని కాక ఆధిపత్యం క్రింద ఉన్న ప్రజలను సూచిస్తోంది. "కాబట్టి దేవుని రాజ్యము మీనుండి తొలగింపబడి దాని ఫలమిచ్చు జనులకియ్యబడునని..." (మత్తయి 21:43). దీన్నిబట్టి ఆయన దృష్టి ప్రజలపైన ఉన్నదని తెలుస్తున్నది.

"... దేవుని రాజ్యము సమీపించియున్నది. మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని..." (మార్కు 1:15). పాలనావ్యవస్థ, పాలించే హక్కు, పాలించడానికి ప్రజలు ఉన్నప్పటికీ పాలనా నిర్వహణ లేనప్పుడు రాజ్యమనేది అక్కడ లేనట్లే. అధికారం కలిగి ఉండటం, అధికార నిర్వహణ అనే రెండు విషయాల మధ్య సంబంధాన్ని వాక్యంలో అనేక సందర్భాల్లో మనం చదువుతాం. మత్తయి 16:19లో క్రీస్తుప్రభువు పేతురుతో "పరలోక రాజ్యముయొక్క తాళపు చెవులు నీకిచ్చెదను" అని అన్నాడు. దీన్నిబట్టి చూస్తే క్రీస్తు అనుగ్రహించే అధికారాన్ని కేవలం పొందటం మాత్రమే కాక దానిని నిర్వహించాల్సి ఉందని మనకు అర్థమవుతున్నది.

దీనంతటిని బట్టి చూస్తే రాజ్యము అనే పదానికి అర్థం ఒకనికి సార్వభౌమాధిపత్యం కలిగిన ప్రాంతంపై లేక ప్రజలపై అతడు నిర్వహించే అధికారమే. అధికార నిర్వహణ అనేది లేనప్పుడు రాజ్యం అనేదానికి అర్థం లేదు.

### రాజ్యం యొక్క ఉద్దేశం:

తన రాజ్యాన్ని స్థాపించడంలో దేవునికి ఒక ప్రత్యేకమైన ఉద్దేశం ఉంది. దీన్ని మనం ఆదికాండం 1:27-30 వచనాల్లో చూడగలం. "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను. దేవుని స్వరూపమందు వారిని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వదించెను. ఎట్లనగా - మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశపక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను. దేవుడు - ఇదిగో భూమిమీదనున్న విత్తనములిచ్చు ప్రతి చెట్టును విత్తనములిచ్చు వృక్షఫలము గల ప్రతి వృక్షమును మీకిచ్చియున్నాను. అవి మీకాహారమగును.

భూమిమీదనుండు జంతువులన్నిటికిని ఆకాశ పక్షులన్నిటికిని భూమిమీద ప్రాకు సమస్త జీవులకును పచ్చని చెట్లన్నియు ఆహారమగునని పలికెను. ఆ ప్రకారమాయెను.'' ఈ వచనాల్లో మనం కనీసం రెండు అంశాలను గమనిస్తాం. (అ) దైవిక ప్రణాళిక (ఆ) దైవిక అధికారం. దేవుడు మానవులద్వారా ఈ భూమిపై తన స్వభావాన్ని, తన అధికారాన్ని వెల్లడిచేయాలని కోరుతున్నాడు. మానవుని సృష్టించడంలో దేవుని ఉద్దేశం ఇదే.

## రాజ్యం గూర్చిన వాగ్దానం:

ఆదాము విఫలం చెందటం ద్వారా పాపం ఈ లోకంలో ప్రవేశించింది. ఆ తర్వాత దేవుడు అబ్రాహామును పిలిచి అతనికి ఒక వాగ్దానం ఇస్తూ, "నీవు లేచి ఈ దేశమునుండియు నీ బంధువులయొద్దనుండియు నీ తండ్రి యింటి నుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను. నిన్ను దూషించువాని శపించెదను. భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదింపబడు''నని చెప్పాడు (ఆది 12:1-3). ఈ వచనాల్లో "నిన్ను గొప్ప జనముగా చేసి" (ఆది 12:2) అనే మాటలు రాజ్యం గురించి వివరిస్తున్నాయి. రాజ్యాన్ని స్థాపించాలి అన్న దేవుని ఉద్దేశం ఆదాము ద్వారా గాని, నోవహు సంతానం ద్వారా గాని నెరవేరదు. కాబట్టి దేవుడు తన రాజ్యం గురించిన ఉద్దేశాన్ని నెరవేర్చుకోవడం కోసం అబ్రాహామును పిలిచి అతనిని ఏడువిధాలైన ఆశీర్వాదాలతో దీవించాడు. అబ్రాహాము యొక్క సంతానాన్ని గొప్ప జనంగా చేస్తానని ఆయన చెప్పాడు. గలతీ 3:29 ప్రకారం "మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాముయొక్క సంతానమైయుండి వాగ్దానప్రకారము వారసులై యున్నారు.''

ఆదికాండం 49:10 చూడండి. "షిలోహు వచ్చువరకు యూదాయొద్ద నుండి దండము తొలగదు. అతనిమధ్యనుండి రాజదండము తొలగదు. ప్రజలు అతనికి విధేయులైయుందురు.'' యూదా గోత్రంనుండి ఒక రాజు ఉద్భవిస్తాడని ఈ వచనం వాగ్దానం చేస్తుంది. ఇక్కడ ఉపయోగించిన "రాజదండం" అనే పదాన్ని బట్టి దీన్ని మనం అర్థం చేసుకోవచ్చు. రాజదండం అనేది ఒక రాజుయొక్క శక్తికి, అధికారానికి సూచన అని మనకు తెలుసు. కాబట్టి యూదా గోత్రం నుంచి ఈ లోకాన్ని పరిపాలించడానికి ఒక రాజు రాబోతున్నాడు.



## దావీదుతో షరతులు లేని నిబంధన:

దేవుడు తన వాగ్దానాన్ని నెరవేర్చుకోవాలి. 2సమూయేలు 7 అధ్యా., 1దిన వృత్తాంతాలు 17:11-14, ఇంకా 2దినవృత్తాంతాలు 6:16 లో వివరించబడి ప్రవక్తయైన నాతాను ద్వారా దావీదుకు దేవుడు చేసిన వాగ్దానాల్లో ఈ దావీదు నిబంధన ఇమిడి ఉంది. దేవునికి, దావీదుకు మధ్య జరిగిన ఈ నిబంధన షరతులు లేనిది. దీనిలో దావీదు సంతానం, యూదాగోత్రం నుండి మెస్సీయ (యేసుక్రీస్తు) వచ్చి ఒక రాజ్యాన్ని స్థాపిస్తాడని, ఆ రాజ్యం నిరంతరం నిలుస్తుందని దేవుడు వాగ్దానం చేశాడు (2సమూ 7:10-13). ఇది షరతులు లేనిది. ఎందుకంటే దేవుడు దాని నెరవేర్పుకోసం వారికి ఏ విధమైన విధేయతా షరతులు నిర్దేశించలేదు. ఆ వాగ్దానాల తప్పనిసరియైన నెరవేర్పు కేవలం దేవుని నమ్మకత్వం పైనే ఆధారపడి ఉంటుంది గాని దావీదు లేక ఇశ్రాయేలు యొక్క విధేయతపై కాదు. ఈ నిబంధనలో వివిధ కీలక వాగ్దానాలు దావీదుకు చేయబడ్డాయి.

1. దేవుడు తాను మొదట చేసిన రెండు నిబంధనల (అబ్రాహాముతోను, మోషేతోను)లోను ప్రస్తావించిన భూమి గురించిన వాగ్దానం తిరిగి ప్రస్తావించాడు. ఈ వాగ్దానం 2సమూయేలు 7:10లో కనిపిస్తున్నది, "మరియు ఇశ్రాయేలీయులను నా జనులు ఇకను కదిలింపబడకుండ తమ స్వస్థలమందు నివసించునట్లు దానియందు వారిని నాటి, పూర్వము ఇశ్రాయేలీయులను నా జనులమీద నేను న్యాయాధిపతులను నియమించిన తరువాత జరుగుచు వచ్చినట్లు దుర్బుద్ధి గల జనులు ఇకను వారిని కష్టపెట్టక యుండునట్లుగా చేసి...''
2. దావీదు సంతానం లేక "సంతతి'' అతని తరువాత ఇశ్రాయేలుకు రాజవుతాడని, దావీదు సింహాసనం ఎన్నటెన్నటికి స్థిరపరచబడుతుందని దేవుడు వాగ్దానం చేశాడు. ఈ వాగ్దానం 2సమూయేలు 7:12-13 లో చదువుతాం, "...నీ గర్భములోనుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి, రాజ్యమును అతనికి స్థిరపరచెదను. అతడు నా నామఘనత కొరకు ఒక మందిరమును కట్టించును. అతని రాజ్య సింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను.''

2సమూయేలు 7:16లో ఈ నిబంధనయొక్క అంశాలన్నీ క్రోడీకరించ

బద్ధాయి, "నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును, నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును.'' ఈ వాగ్దానంలోని దావీదు "సంతానము'', "రాజ్యము'', "సింహాసనము'' నిత్యం స్థిరపరచబడతాయనే మాటలు ప్రాముఖ్యమైనవి. ఎందుకంటే అవి మెస్సీయ దావీదు వంశంలోనుండి వచ్చి ఒక రాజ్యాన్ని స్థాపించి దానిపై పాలన చేస్తాడని వెల్లడి చేస్తున్నాయి. ఇక్కడ కనిపించే "సంతానం'' అనే మాట దావీదు సంతతిలోనుండి ఒక వంశాన్ని, వాగ్దానాన్ని, "రాజ్యం'' అనే మాట ఒక రాజుచేత పాలించబడే ఒక జనాంగాన్ని, "సింహాసనం'' అనే మాట ఒక రాజు యొక్క అధికారపూరిత పాలనను, "నిత్యము'' అనే మాట దావీదుకు, ఇశ్రాయేలుకు దేవుడు చేసిన వాగ్దానం యొక్క శాశ్వతమైన, షరతులు లేని స్వభావాన్ని స్పష్టం చేస్తున్నాయి.

**దేవుడు ఆకాశమహాకాశాల్లో నివసిస్తాడు:** ఆదికాండం 1:1 "దేవుడు ఆకాశమును భూమిని సృజించెను'' అని చెబుతున్నది. ఆకాశమండలాలన్నీ ఆయనవే. ''చూడుము, ఆకాశము, మహాకాశము, భూమియు అందున్నదంతయు నీ దేవుడైన యెహోవావే.'' (ద్వితీ 10:14).

అయితే దేవుడు నిజంగా ఈ భూమిపైన నివాసముంటాడా? "ఆకాశ మహాకాశములు సహితము నిన్ను పట్టజాలవు. నేను కట్టించిన ఈ మందిరము ఏలాగు పట్టజాలును?'' (1రాజులు 8:27). ఇదే భావం 2దిన 6:18; నెహెమ్యా 9:6 వచనాల్లో సహితం కనిపిస్తున్నది. "ఆకాశము యెహోవా వశము. భూమిని ఆయన నరులకిచ్చియున్నాడు.'' (కీర్తన 115:16). అయితే పాతనిబంధనలోని వ్యక్తులంతా దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చడంలో విఫలమైపోయారు.

## దావీదు కుమారుడైన యేసు:

కాబట్టి మత్తయి 1:1 లో చూచినట్లు దేవుడు తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపించాడు. "అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడైన యేసుక్రీస్తు వంశావళి.''

దేవుని ఉద్దేశం ప్రభువైన యేసుక్రీస్తులో, ఆయన ద్వారా నెరవేర్చబడాలి. క్లుప్తంగా ప్రభువైన యేసుక్రీస్తు యొక్క పనిని కొలస్సీ 1:12-22 లో ఈ విధంగా చదువుతాం,

"అందుచేత ఈ సంగతి విననినాటనుండి మేమును మీ నిమిత్తము



ప్రార్థన చేయుట మానక, మీరు సంపూర్ణజ్ఞానమును ఆత్మసంబంధమైన వివేకము గలవారును, ఆయన చిత్తమును పూర్ణముగా గ్రహించినవారునై, ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధి పొందుచు, అన్ని విషయములలో ప్రభువును సంతోషపెట్టునట్లు, ఆయనకు తగినట్లుగా నడుచుకొనవలెననియు, ఆనందముతో కూడిన పూర్ణమైన ఓర్పును దీర్ఘశాంతమును కనుపరచునట్లు ఆయన మహిమ శక్తిని బట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలెననియు, తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగుటకు మనలను పాత్రులనుగా చేసిన తండ్రికి మీరు కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలెననియు దేవుని బతిమాలుచున్నాము. ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను. ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది. ఆయన అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను, ప్రభుత్వము లైనను ప్రధానులైనను, అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను, ఆయనను బట్టియు సృజింప బడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు. సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను. ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెనని, ఆయన సిలువరక్తము చేత సంధిచేసి, ఆయనద్వారా సమస్తమును, అవి భూలోకమందున్నవైనను, పరలోకమందున్న వైనను, వాటినన్నిటిని ఆయనద్వారా తనతో సమాధానపరచు కొనవలెననియు తండ్రి అభీష్టమాయెను. మరియు గతకాలమందు దేవునికి దూరస్థులును, మీ దుష్క్రియలవలన మీ మనస్సులో విరోధభావము గలవారునై యుండిన మిమ్మును కూడ తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలువబెట్టుటకు ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను.''

## పరలోక రాజ్యం అంటే ఏమిటి?

ముఖ్యంగా మత్తయి సువార్తలో మనం చూసే "పరలోక రాజ్యం" (అక్షరార్థంగా పరలోకముల రాజ్యం) అనే వ్యక్తీకరణ పరలోక సంబంధమైన పరిపాలనను, అంటే ఈ భూమిపై పరలోకంలోని దేవుని ఆధిపత్యాన్ని సూచిస్తుంది. పరలోకరాజ్యం అనేది కొత్త నిబంధనకు చెందిన పదమే అయినా దాని మూలాలు మాత్రం పాతనిబంధనలోనే చూస్తాం. తన కాలంలో దేవునిచేత అణగద్రొక్కబడిన నెబుకద్నెజరు రాజు అనుభవపూర్వకంగా "పరలోకం ఆధిపత్యం వహిస్తుంది" అన్న సత్యాన్ని గుర్తించాడు. ఒక రాజుగా తన ఆధిపత్యం నిలిచేది కాదని దేవుని "ఆధిపత్యము చిరకాలము వరకు ఆయన రాజ్యము తరతరములకు నున్నవి" అని అతడు గ్రహించాడు (దానియేలు 4:34).

"తానెవరికి దాని అనుగ్రహింప నిశ్చయించునో వానికి అనుగ్రహించునని" (దానియేలు 4:32) అనే మాటలు రాజ్యాధికారంలో ఒక తాత్కాలిమైన, దైవవ్యవహార కాలక్రమం అనే అంశాలు ఇమిడి ఉన్నాయని మనకు సూచిస్తున్నాయి. ఇది భూమిపై దేవుని రాజ్యాధిపత్యం. ఈ భూమిపైన అది బహిరంగంగా, మానవుల ద్వారా వెల్లడి అవుతుంది.

## రాజ్యానికి రాజు:

ఈ రాజ్యానికి రాజుగా మన ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి "దేవుని రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడి", "మనుష్య కుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైనవాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును. అప్పుడు నీతిమంతులు తన తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు. చెవులు గలవాడు వినునుగాక" (మత్తయి 13:41-43) అనే మాటలతో దేవుని రాజ్యమును గూర్చిన సందేశాన్ని బోధించాడు. ఈ వాక్యాల్లో "ఆయన రాజ్యం" అంటే ప్రభువైన యేసుక్రీస్తు రాజ్యం. రెండవదిగా "తన (ఆయన) తండ్రి రాజ్యం" అంటే దేవుని రాజ్యం మనం చూస్తాం.

కొత్త నిబంధనలో "దూత - మరియా భయపడకుము; దేవునివలన నీవు కృప పొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు



యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడన బడును. తండ్రియైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతము లేనిదైయుండునని ఆమెతో చెప్పెను" (లూకా 1:30-33) అని చెప్పిన ప్రకారం "పరలోక రాజ్యం" ప్రభువైన యేసుక్రీస్తు పుట్టుకనుండి ప్రారంభమై, "ఏడవ దూత బూర ఊదినప్పుడు పరలోకములో గొప్ప శబ్దములు పుట్టెను. ఆ శబ్దములు - ఈ లోకరాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యమునాయెను; ఆయన యుగయుగముల వరకు ఏలుననెను" (ప్రకటన 11:15) అని చెప్పినట్లు ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాకడవరకు కొనసాగుతుంది. యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చినపుడు ఆయన, బాప్తిస్మమిచ్చే యోహాను రాజ్యము "సమీపించియున్నది" అని ప్రకటించారు. వారు దానిని "పరలోక రాజ్యము" (మత్తయి 3:2; 4:17) అని పిలిచారు. ఈ రాజ్యం భూమిపైన ఉన్నప్పటికీ దాని పరిపాలనా స్థానం మాత్రం పరలోకంలో ఉంది అని ఈ పదం సూచిస్తున్నది. కొందరు తప్పుగా అర్థం చేసుకున్నట్లు "పరలోక రాజ్యం" పరలోకంలో ఉండే రాజ్యం కాదుగాని, పాలించే సింహాసనం పరలోకంలో కలిగిన భూమిపైని రాజ్యం. కీర్తన 103:9 దీన్ని స్పష్టం చేస్తున్నది, "యెహోవా ఆకాశమందు తన సింహాసనమును స్థిరపరచియున్నాడు. ఆయన అన్నిటిమీద రాజ్యపాలన చేయుచున్నాడు."

"రాజ్య సువార్త"ను ప్రకటించడం ద్వారా పరలోకరాజ్యం గురించి బోధించి (మత్తయి 3-4), ఆ రాజ్యం క్రింద పాటించాల్సిన నైతిక విధి విధానాలను గురించి "కొండమీద ప్రసంగం"లో బోధించిన (మత్తయి 5-7) తరువాత ప్రభువు ఆ రాజ్యం ఈ భూమిపైన స్థాపించబడిన తరువాత దానియొక్క ప్రభావం ఎలా ఉంటుందో అనే విషయం ఆయన ఆయా కార్యాల ద్వారా చేసి చూపించాడు (మత్తయి 8-9).

తన అద్భుతాల ద్వారా ఆయన అనారోగ్యం, జబ్బులు, బాధలు, దయ్యాల ప్రభావం, బీదరికం, ప్రకృతి వైపరీత్యాలు, హింస, భయం, మరణం, ఆకలి మొదలైనవాటన్నిటినీ పారద్రోలి వాటికి ముగింపు పలికాడు. తన శిష్యులను ప్రజల దగ్గరకు పంపి వారంతా తనను వారి రాజుగా స్వీకరించ టానికి పురికొల్పాడు (మత్తయి 10). వారు ఆయన్ని అంగీకరించి ఉంటే ఆయన

అప్పటికప్పుడే పాత నిబంధన వాగ్దానాలను అనుసరించి తన సర్వ మహిమా ప్రభావాలతో కూడిన రాజ్యాన్ని స్థాపించి ఉండేవాడు.

**వారి పరిచర్య ఫలితం:** విచారకరమైన విషయం ఏమిటంటే అపొస్తలులు, బాప్తిస్మమిచ్చే యోహాను, ప్రభువు చేసిన సువార్త పరిచర్యను ప్రజలు తిరస్కరించారు! గలిలియలోని గ్రామాలలో ఉన్న సామాన్య ప్రజానీకం ఆయన్ని అంగీకరించలేదు (మత్తయి 11:1-24). యూదాజాతి నాయకులు సహితం ఆయన్ని అంగీకరించలేదు (మత్తయి 12:22-30).

కాబట్టి ప్రభువు తనలో విశ్వాసముంచిన కొద్దిమంది శేషాన్ని బయటికి పిలిచి వారికి దేవుని హృదయ రహస్యాలను బోధించాడు (మత్తయి 11:25-30). 12 వ అధ్యాయానికొచ్చేసరికి బాధ్యతాయుతమైన నాయకులు ప్రభువు కార్యాలను సాతానుకు వర్తింపజేయడం ద్వారా పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా దేవదూషణ అనే క్షమాపణ లేని పాపం జరిగించి వారి జాతి వినాశనానికి దారులు తెరిచారు (మత్తయి 12:22-37).

## పరలోక రాజ్య ప్రారంభం:

ఇదిలా ఉండగా ప్రభువు ఆ జాతితో తన సంబంధాలు విచ్ఛిన్నమౌతాయన్న అనేకమైన సూచనలు వారికి చూపాడు. తద్వారా అది దేవుని రాజ్యాధికార వ్యవహారాల్లో తాత్కాలికంగా తొలగించబడుతుందని సూచించాడు. చారిత్రికంగా అపో.కా. 7 అధ్యాయంలో యూదా జాతి నాయకులు (సన్‌హెడ్రిన్) క్రీస్తు తమపై రాజ్యం చేయడం తమకిష్టం లేదని తెలుపుతున్నట్లుగా స్తెఫనును రాళ్ళతో కొట్టి చంపడంతో నెరవేరింది (లూకా 19:14). మత్తయి సువార్తలో ఈ క్రింది సంకేతాత్మక ఘట్టాల ద్వారా అది సూచించబడింది.

**మొదటి సంకేతం:** సబ్బాతు దినాన వెన్ను కంకులను కోసి తినటం, ఒకరిని స్వస్థపరచటం (మత్తయి 12:1-13) అనే సంఘటనలను ప్రభువు, ఆయన శిష్యులు సబ్బాతును మీరినట్లుగా ఆరోపించడానికి వాడుకున్నారు. నిజానికి లేఖనాలకు వ్యతిరేకంగా వారేమీ చేయనప్పటికీ పరిసయ్యులు దానిని ధర్మశాస్త్ర ఉల్లంఘనగా భావించారు. ఆ జాతి మొత్తం ప్రభువును తిరస్కరించినదాన్ని బట్టి ప్రభువుకు ఆ జాతికి మధ్య ఉన్న నిబంధన విచ్ఛిన్నమైపోయింది. కాబట్టి



ఆ నిబంధనా సంబంధం క్రింద ఉన్న సబ్బాతు (నిర్గమ 31:12-17) దాని ప్రభావాన్ని కోల్పోయింది. సబ్బాతు దినాన ప్రభువు చర్యలు ఆ జాతితో ఆయన నిబంధనా సంబంధం తెగిపోయింది అని స్థిరపరిచాయి.

**రెండవ సంకేతం:** ప్రభువు ప్రజల మధ్యనుండి వెడలిపోయాడు. అప్పటినుండి ఆయన వీధులలో ప్రజల మధ్యకు వెళ్ళి రాజ్యం గురించిన శుభవచనాలను వినిపించడం మానేశాడు (మత్తయి 12:14-21). ఎందుకంటే ప్రభావ మహిమలతో కూడిన తన రాజ్యాన్ని ఆ జాతికి ఆయన ఇవ్వబోవడం లేదు. ఇకనుండి అది "సమీపించి యున్నది" అని చెప్పడానికి వీలు లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభువు 'తనను ప్రసిద్ధి చేయవద్దని' తన శిష్యులకు ఆజ్ఞాపించాడు (మత్తయి 12:16). ఆ తరువాతి అధ్యాయాల్లో దేవుడు ఆ జాతినుండి వేరుపడిపోయాడన్నదానికి సంకేతంగా ప్రభువు ప్రజలనుండి మరింతగా దూరమైపోయినట్లు చూస్తాం (మత్తయి 12:15; 13:1; 13:53; 14:13; 15:21; 15:29; 16:4).

**మూడవ సంకేతం:** మూడవదిగా ప్రభువు తానే వారి మెస్సీయనని వెల్లడిచేసే మరే గుర్తులూ వారికి ఇవ్వడానికి తిరస్కరించాడు (మత్తయి 12:38-45). వారి అపనమ్మకం ఎంత బలీయమైందంటే ఆ జాతి చివరికి అంత్యక్రీస్తును అంగీకరించి ఆహ్వానించడానికి వెనుకాడదు. ఆ విధంగా వారి కడపటి స్థితి మొదటి స్థితి (బబులోను చెరకు ముందటి వారి విగ్రహారాధన) కంటే మరింత అధ్వాన్నంగా తయారౌతుంది.

**నాల్గవ సంకేతం:** ఆయన తల్లి, ఆయన సహోదరుల మాటలను ఆయన తిరస్కరించాడు. ఇది కూడా ఆయన ఆ జాతి ప్రజలతో తన స్వాభావికమైన బాంధవ్యాలను తెంపివేసుకోవడానికి సూచనగా ఉంది (మత్తయి 12:46-50).

**ఐదవ సంకేతం:** తాను ప్రజలకు బోధిస్తున్న "ఇంటనుండి (బయటకు) వెళ్ళి సముద్ర తీరమున కూర్చుండెను" (మత్తయి 13:1). ఇది కూడా ఆ జాతి ప్రజలతో విచ్ఛిన్నమైన సంబంధం గురించి చెబుతున్నది. ఇంతకు ముందు చెప్పినట్లుగా ఆ జాతితో తెగతెంపులు అనేవి చారిత్రికంగా అపొస్తలుల కార్యాలు గ్రంథంలో జరిగింది. న్యాయబద్ధంగా క్రీస్తును తిరస్కరించి సిలువవేసిన సమయంలో ఆ జాతి ఆయనతో వేరుపడిపోయింది (కీర్తన 69:22-28). అయితే స్తెఫనును వారు రాళ్ళతో కొట్టి చంపేటంతవరకు అది అధికారికంగా

జరగలేదు. అతడు హతసాక్షి అయిన ఆ సందర్భంలో అతనిలోని దేవుని ఆత్మ చెప్పిన సాక్ష్యాన్ని వారు తిరస్కరించడం ద్వారా అధికారికంగా వారికి, ప్రభువుకు మధ్య సంబంధం విచ్ఛిన్నమైంది (అపొ.కా.7). ఇశ్రాయేలు చరిత్రలో స్తెఫనును రాళ్ళతో కొట్టి చంపడం అత్యంత ప్రాముఖ్యమైన ఘట్టం. అప్పటినుండి దేవుడు సువార్తను అన్యజనుల మధ్యకు పంపించడం ప్రారంభించాడు. చిట్ట చివరకు క్రీ.శ. 70 సంవత్సరంలో రోమా సైన్యం వారిపైకి దండెత్తి వచ్చి యెరూషలేము నగరాన్ని, దానిలోని మందిరాన్ని సమూలంగా ధ్వంసం చేసినప్పుడు ప్రభువుతో ఇశ్రాయేలు జాతి నిబంధనా సంబంధం అక్షరార్థంగా విచ్ఛిన్నమైపోయింది (మత్తయి 22:7-8; లూకా 21:20-24). యూదులు తమ సువార్త ప్రకటనను అంగీకరించడానికి తిరస్కరించినపుడు పౌలు, బర్నబాలు "ఇదిగో మేము అన్యజనుల యొద్దకు వెళ్ళుచున్నాము'' (అపొ.కా.13:46) అన్నారు. సిలువనుండి క్రీ.శ. 70 వరకు 40 సంవత్సరాలు. అది దేవుని దీర్ఘశాంతంతో కూడిన ఓరిమిని సూచిస్తుంది.

దేవుని రాజ్యం నిలిపివేయబడిందా? కొందరు భావిస్తున్నట్లుగా దేవుని రాజ్యం నిలిపివేయబడలేదు. ఎవరైతే తమ జీవితాల్లో ఫలిస్తారో వారికది అనుగ్రహించ బడింది. "యేసు ఇంటనుండి బయలుదేరి సముద్రతీరమున కూర్చుండెను'' (మత్తయి 13:1) అనే వాక్యానికి నిజమైన అర్థమిదే. రాజ్యానికి రాజు అలాగే నిలిచి ఉన్నాడు గాని ఆయన ఆధిపత్యం క్రింద ఉన్న ప్రజలు మారినట్లు మత్తయి 13:1-3 చెబుతోంది, "ఆ దినమందు యేసు ఇంటనుండి వెళ్ళి సముద్రతీరమున కూర్చుండెను. బహు జనసమూహములు తనయొద్దకు కూడివచ్చినందున ఆయన దోనెయెక్కి కూర్చుండెను.'' రాజ్యం నిలిపివేయ బడలేదు అని చెప్పడానికి మరొక కారణం 12 అధ్యాయంలో చూడగలం. "అందుకాయన తనతో ఈ సంగతి చెప్పినవాని చూచి - నా తల్లి యెవరు? నా సహోదరులెవరు? అని చెప్పి, తన శిష్యులవైపు చెయ్యి చాపి - ఇదిగో నా తల్లియు నా సహోదరులును; పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు, నా తల్లియు ననెను'' (మత్తయి 12:48-50).

మత్తయి 21:33-46 లోని ద్రాక్షతోట ఉపమానంలో యేసుక్రీస్తు "కాబట్టి దేవుని రాజ్యము మీయొద్దనుండి తొలగింపబడి దాని ఫలమిచ్చు జనుల



కియ్యబడునని మీతో చెప్పుచున్నాను'' (మత్తయి 21:43) అన్నాడు. ఇక్కడ కూడా రాజ్యం నిలిపివేయబడలేదనే సంగతికి రుజువు కనిపిస్తుంది. ఎందుకంటే రాజ్యం ఇప్పుడు దాని ఫలమిచ్చు జనుల చేతుల్లో ఉంది. ప్రస్తుత కాలంలో పరలోకరాజ్యం సంఘంలో వెల్లడి అవుతున్నట్లు స్పష్టంగా చూడగలం. యేసుక్రీస్తు మధ్యాకాశంలో దిగివచ్చినపుడు, సంఘం ఆరోహణం అయిన సమయంలో పరలోకరాజ్యం వేయి సంవత్సరాల పాలనలో యెరూషలేము రాజధానిగా దావీదు సింహాసనం స్థాపించబడుతుంది. దేవునిపట్ల నమ్మకంగా ఉన్నవారంతా ఈ కాలంలో యేసుక్రీస్తుతో కలిసి ఈ భూమిపై రాజ్యమేలుతారు.

**రాజ్యం గురించిన మొదటి అంశం:** పాతనిబంధనలో కనిపించే "దేవుని రాజ్యం'' గురించి ఆలోచించేటప్పుడు దానిలోని రెండు అంశాలను ప్రత్యేకంగా విభాగించడంలో చాలా శ్రద్ధ కనపరచాల్సి ఉంది. మొదటిగా, లేఖనం తన విస్తారమైన ప్రాంతాలను పాలించే మహోన్నతుడైన దేవుని పరిపాలన క్రింద ఉన్న ఒక అనంతమైన దేవుని రాజ్యం గురించి మాట్లాడుతుంది. దానియేలు 4:34,35 వచనాలు ఆయన రాజ్యం గురించిన ఈ అంశం గురించి మాట్లాడుతున్నాయి, "చిరంజీవియు, సర్వోన్నతుడునగు దేవుని స్తోత్రము చేసి ఘనపరచి స్తుతించితిని; ఆయన ఆధిపత్యము చిరకాలము వరకు ఆయన రాజ్యము తరతరములకు నున్నవి. భూనివాసులందరు ఆయన దృష్టికి ఎన్నికకు రానివారు; ఆయన పరలోక సేనయెడలను భూనివాసులయెడలను తన చిత్తము చొప్పున జరిగించువాడు; ఆయన చేయిపట్టుకొని నీవేమి చేయుచున్నావని ఆయనతో చెప్పుటకు ఎవడును సమర్థుడు కాడు.'' తన సృష్టిపైన ఆయన చూపే ఈ ఆధిపత్యం విశ్వవ్యాప్తమైనది, సంపూర్ణమైనది, శాశ్వతమైనది. అయితే లేఖనాలు వైశాల్యంలోను, కాలంలోను ఒక పరిమితితో కుదించబడిన ఒక రాజ్యం గురించి కూడా చెబుతున్నాయి. అది శాశ్వతమూ కాదు, విశ్వవ్యాపితమూ కాదు. "దేవుని రాజ్యం'' గురించిన ఈ రెండు అంశాలను మనం వేరుచేసి చూడకపోయినంతవరకు సత్యవాక్యాన్ని సరిగా విభజించలేము, పాతనిబంధన ద్వారాలను తెరిచే తాళపుచెవిని పొందలేము కూడా.

## రాజ్యం గురించిన రెండవ అంశం:

దేవుని రాజ్యం గురించిన రెండవ అంశం అది దైవ నిర్వహణా కాలక్రమం లోనిది. అంటే అది ఒక ప్రాంతానికి సంబంధించినది, తాత్కాలికమైనది అని. ఇది ఈ భూమిపై బహిరంగంగా ప్రదర్శించబడి, మానవుల ఆధీనంలో ఉన్న దేవుని రాజ్యం. అది మొదట ఇశ్రాయేలు ప్రజల మధ్య స్థాపించబడింది. అప్పుడు ఆయన వారి మధ్య ఉండి మందసం పైన ఉన్న కరుణాపీఠాన్నే తన సింహాసనంగా చేసికొని కెరూబుల మధ్య నివసించాడు. అది ఈ భూమిపైన దేవుని "రాజ్యం." యెహోషువ 3:11,13 లో చెప్పినట్లుగా యెహోవా తన ప్రజలైన ఇశ్రాయేలు మధ్య నివాసం ఏర్పరచుకొని ఉన్నపుడు వ్యక్తపరచబడిన ఒక గమనించదగిన ప్రస్తావన, "సర్వలోకనాథుడగు యెహోవా నిబంధన మందసమును మోయు యాజకుల అరకాళ్ళు యొర్దాను నీళ్ళను ముట్టగానే యొర్దాను నీళ్ళు, అనగా ఎగువనుండి పారు నీళ్ళు ఆపబడి యేకరాశిగా నిలుచును." లేఖనాల్లో దేవుడు తనను ఈ పేరుతో పిలుచుకోవడం ఇదే మొదటిసారి అని మనం గమనించాలి. ఇక్కడ అది దేవుని మందసంతో సంబంధం కలిగి ఇశ్రాయేలీయులు యొర్దాను నదిగుండా వెళ్తున్నపుడు జరిగింది. తన ప్రజలకు తానిచ్చిన ఆ పాలుతేనెలు ప్రవహించు దేశాన్ని మొదటగా యెహోవాయే స్వాధీనం చేసుకుంటున్నాడు. ఇశ్రాయేలీయులు గనుక తమ ఈ రాజుకు, ఆయన న్యాయవిధులకు లోబడి ఉండినట్లయితే ఆయన వారిమధ్య నిలిచి ఉండటమే కాక, వెయ్యేళ్ళ పరిపాలనలో వలె వారిద్వారా ఈ సర్వలోకంపై ఆధిపత్యం నెరిపి ఉండేవాడు. దీనికి రుజువు వారు ఆయనకు లోబడి ఉన్నప్పటి కొద్ది కొద్ది సమయాల్లో మనం చూడగలం. ఆయన వారి శత్రువులను ఓడించి, వారి చుట్టూ ఉన్న అన్యజనులను అణగద్రొక్కాడు. కాని ఇశ్రాయేలు అవిధేయత చూపి తమ రాజుపై తిరుగుబాటు చేశారు. "అందుకు యెహోవా సమూయేలునకు సెలవిచ్చినదేమనగా - జనులు నీతో చెప్పిన మాటలన్నిటి ప్రకారము జరిగింపుము; వారు నిన్ను విసర్జించలేదు గాని తమ్మును ఏలకుండ నన్నే విసర్జించియున్నారు." (1సమూ 8:7).

దాని తరువాత కొన్ని శతాబ్దాలపాటు దేవుడు వారిని తన దీర్ఘశాంతంతో సహించాడు. అయితే యెహెజ్కేలు కాలంలో వారిమధ్య ఉన్న షెకీనా మహిమ వారిని విడిచిపోయింది. యెహెజ్కేలు 10:18లో, "యెహోవా మహిమ మందిరపు



గడపదగ్గర నుండి బయలుదేరి కెరూబులకు పైతట్టున నిలువగా..." అన్న తరువాత 11:23 లో "మరియు యెహోవా మహిమ పట్టణములోనుండి పైకెక్కి పట్టణపు తూర్పుదిశనున్న కొండకు పైగా నిలిచెను." అని చదువుతాం. మొదట షెకీనా మహిమ పరిశుద్ధ స్థలంలోని మందసాన్ని విడిచిపెట్టింది, నెమ్మదిగా కదులుతూ మందిరం బయటకు వెళ్ళింది. అక్కడినుండి ఇంకా దూరంగా వెళ్ళి ఒలీవ పర్వతం పైన నిలిచి ఆ తరువాత వారి కనుదృష్టినుండి అది అదృశ్యమైంది. దేవుడు భూమిపైన ఉన్న తన నివాసాన్ని, సింహాసనాన్ని విడిచిపెట్టాడు. ఇకనుండి దేవుడు ఒక నూతనమైన పేరును లేక హోదాను సంతరించుకున్నాడు. 2దిన 36:23 లో ఇలా ఉంది, "పారసీక దేశపు రాజైన కోరెషు ఆజ్ఞాపించునదేమనగా -ఆకాశమందలి దేవుడైన యెహోవా లోకమందున్న సకల జనములను నా వశము చేసి..." అలాగే ఎజ్రా గ్రంథం ప్రారంభ వచనాల్లో "ఆకాశమందున్న దేవుడైన యెహోవా లోకమందున్న సకల జనములను నా వశము చేసి యూదా దేశమందున్న యెరూషలేములో తనకు మందిరమును కట్టించుమని నాకు ఆజ్ఞ ఇచ్చియున్నాడు;..." అని చదువుతాం. దైవికమైన ఈ నామం లేఖనాల్లో ఇక్కడే మొదటిసారి ప్రస్తావించబడింది. ఈ వ్యక్తీకరణ ఏదో కాకతాళీయంగా చేసింది కాదు. ఇది ఈ భూమితో దేవుని వ్యవహారాల్లో ఒక విప్లవాత్మకమైన మార్పును సూచిస్తున్నది. దేవుని శాశ్వతమైన సింహాసనం ఎన్నటికీ నిలిచి ఉండేదైనప్పటికీ, ఈ భూమిపై దేవుడు చేపట్టిన అధికారం మాత్రం విడిచిపెట్టబడుతుంది అన్న సత్యాన్ని అది నొక్కి చెబుతున్నది. ఇశ్రాయేలు మధ్య తన సింహాసనం నిలిచి లేని సమయంలో దేవుడు ఈ భూమిపై మరొక సింహాసనాన్ని నిలబెట్టాడు. దానిని ఆయన మానవులకు ధారాదత్తం చేశాడు. అది యెరూషలేముపై అన్యజనుల ఆధిపత్యం నడిచినంతకాలం కొనసాగుతుంది. దానియేలు గ్రంథంలోని మూలాంశం ఇదే. రెండవ అధ్యాయంలో వ్రాయబడిన నెబుకద్నెజరు కల, దాని వివరణలో ఆ గొప్ప ప్రతిమ అన్యరాజుల పరిపాలనా కాలం, ఈ భూమిపై వారి పాలనా స్వభావాలను వివరించింది (వ.37-39 చూడండి).

నెబుకద్నెజరు యొక్క ప్రవచనాత్మకమైన కల నాలుగు అన్యరాజుల సామ్రాజ్యాలు వాటి అంతం గురించి మాత్రమే కాక, వాటిని మించి స్వభావంలో వాటికంటే పూర్తిగా భిన్నమైన మరొక భవిష్యత్తు సామ్రాజ్యం గురించి వెల్లడి చేసింది. 44వ వచనంలో "ఆ రాజుల కాలములలో పరలోకమందున్న దేవుడు

ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దాని పొందినవారికి గాక మరెవరికి చెందదు; అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగయుగముల వరకు నిలుచును" అని చదువుతాం. ఇదే ఐదవ రాజ్యం, వాగ్దానం చేయబడిన మెస్సీయ రాజ్యం. దీనిగురించి దానియేలు 7:13,14 లో మరింత వివరంగా చదువుతాం, "రాత్రి కలిగిన దర్శనములను నేనింక చూచుచుండగా, ఆకాశ మేఘారూఢుడై మనుష్యకుమారుని పోలిన యొకడు వచ్చి ఆ మహా వృద్ధుడగువాని సన్నిధిని ప్రవేశించి, ఆయన సముఖమునకు తేబడెను. సకల జనులును రాష్ట్రములును ఆయా భాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయనకీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది అదెన్నటికిని తొలగిపోదు; ఆయన రాజ్యము ఎప్పుడును లయము కాదు." లూకా 19:12,15 వచనాలతో పోల్చండి.

దానియేలు తరువాత ప్రవచన స్వరం వినిపించడం త్వరగా మానివేసింది. నాలుగు వందల సంవత్సరాల కాలం పాటు ఇశ్రాయేలు జాతి దేవుడు తన వాగ్దానాలను ఎప్పుడు నెరవేరుస్తాడా అని తదేకంగా ఎదురుచూసింది. ఆ తరువాత బాప్తిస్మమిచ్చే యోహాను వచ్చి పాత నిబంధన ప్రవక్తలు రాజ్యసందేశాన్ని ఎక్కడైతే విడిచిపెట్టారో అక్కడినుండి తాను ప్రారంభించాడు. "పరలోక రాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొందుడని అరణ్యములో ప్రకటించు చుండెను" (మత్తయి 3:1,2). ఎందుకంటే రాజు తానే స్వయంగా యూదుల మధ్య ప్రత్యక్షం కాబోతున్నాడు. "పరలోకరాజ్యము సమీపించియున్నది" అని యోహాను చెప్పినప్పుడు దానిని విన్న యూదులు ఏ విధంగా అర్థం చేసుకున్నారనుకుంటున్నారు? వారికి ఆనాడు అందుబాటులో ఉన్న లేఖనమంతా పాతనిబంధన మాత్రమే. సహజంగానే వారి తలంపులన్నీ పరలోకంలో మనుష్యకుమారుడు ప్రాచీనుడైన వాని చేతుల్లోనుండి స్వీకరించబోయే రాజ్యంపైకి మళ్ళుతాయి.

## రాజ్య సందేశం:

బాప్తిస్మమిచ్చే యోహాను బోధ అంతా "యూదా అరణ్యాలలో" జరిగిందన్న సంగతి గమనార్హం. మెస్సీయకు ముందుగా నడిచే ఈ వార్తాహరుని స్థానం



అతని పనియొక్క ఫలితం గురించిన విషాదకరమైన సూచనగా ఉంది. అతడు యెరూషలేముకు దూరంగా, దేవాలయానికి బయట పనిచేశాడు. అతని సందేశం - "మారుమనస్సు పొందుడి." ఇది ఇశ్రాయేలుయొక్క విషాదకరమైన ఆధ్యాత్మిక స్థితికి సూచన. దేవునితో సహవాసంలో నడుస్తున్న ప్రజలకు "మారుమనస్సు పొందండి" అని నేను చెప్పనక్కరలేదు కదా. "మారుమనస్సు పొందండి" అని చెప్పవలసింది దేవునికి దూరంగా ఉన్నవారికి మాత్రమే. రాజు జన్మించిన ముప్ఫై సంవత్సరాల తరువాత బాప్తిస్మమిచ్చే యోహాను దేవుని రాజ్యము "సమీపించియున్నది" అని ప్రకటించాడు (మత్తయి 3:1,2). ఆ తరువాత రాజు తనను తాను ఇశ్రాయేలుకు కనపరచుకున్నప్పుడు ఆయన కూడా అదే ప్రకటన చేశాడు (మత్తయి 4:17-23). ఆ తరువాత ఆయన పన్నెండు మంది శిష్యుల్నీ (మత్తయి 10:7), డెబ్బైమందినీ అదే ప్రకటన చేయడానికి పంపించాడు (లూకా 10:1-9). "మారుమనస్సు పొందుడి, పరలోక రాజ్యము సమీపించియున్నది", ఇదే రాజ్య సందేశం (మత్తయి 3:1,2). ఇప్పుడు "మారుమనస్సు పొందుడి" అనే మాట స్థానిక సమాజాలకు చెప్పబడింది (ప్రకటన 2,3 తో పోల్చండి). ఇక్కడ కూడా మనం దేవుని రాజ్యం, పరలోక రాజ్యం అనేవాటి మధ్య తేడాను గమనించాల్సి ఉంది. "దేవుని రాజ్యం" అంటే ఈ విశ్వంలో సృష్టించబడిన జీవజాలం, అనంతమైన కాలం, పరలోకం, భూలోకం, వీటన్నిటితో కూడిన దేవుని పరిపాలన. అది ఆధ్యాత్మికమైంది, మన అవగాహన లేక గమనింపులో కలిగేది కాదు (లూకా 17:20,21). అది "నూతన జన్మ"తోనే ప్రారంభమవుతుంది (యోహాను 3:5). అది "(దేవుని రాజ్యము) భోజనమును, పానమును కాదు గాని నీతియును సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది" (రోమా 14:17). అయితే ఒక వ్యక్తి పరలోక రాజ్యంలో "నూతన జన్మ" అనుభవం లేకుండగనే కేవలం తన ఒప్పుకోలును బట్టి ప్రవేశించగలడు. దేవుని పిల్లల మధ్య సాతాను దాని విత్తనాలు నాటగలడు. పరలోకాల రాజ్యం అంటే మంచి, చెడుల సంగమం.

## రాజుకు ముందుగా నడిచేవాడు:

యోహాను ఎవరి గురించైతే ప్రకటించాడో ఆయన ప్రత్యక్షమయ్యాడు. రాజు మరొకసారి తనకు తానే ఈ భూమిపై ఇశ్రాయేలుకు దగ్గరగా వచ్చాడు. ఎవరైతే గతకాలంలో భూమిపై తన సింహాసనాన్ని విడిచిపెట్టాడో, ఎవరైతే

యెహెజ్కేలు కాలంలో పరలోకానికి వెళ్ళిపోయాడో, ఎవరైతే అప్పటినుండి "పరలోకములోనున్న దేవుడు" అని పిలువబడుతున్నాడో, ఆయన తన సాటిలేని కృపలో మానవరూపం ధరించాడు. తాను మరొకసారి ఈ భూమిపైకి తనకు తానే వచ్చి ఇశ్రాయేలు మధ్య నిలిచాడు కాబట్టి పరలోక రాజ్యము "సమీపించియున్నది'' అని చెప్పబడింది. కాబట్టి మత్తయి 4:17 లో "అప్పటినుండి యేసు - పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సునొందుడని చెప్పుచు ప్రకటింప మొదలుపెట్టెను.'' అని చదువుతాం. అధికారం, ప్రభావం ప్రభువైన యేసుక్రీస్తుకు ఇవ్వబడింది, రాజ్యభారం ఆయన భుజములమీద మోపబడింది. "దూత - మరియా భయపడకుము; దేవునివలన నీవు కృప పొందితివి. ఏలయనగా నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టుదువు; ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదై యుండునని ఆమెతో చెప్పెను.'' (లూకా 1:30-33). మెస్సీయకు చెందిన భూసంబంధమైన రాజ్యంలో క్రీస్తు ఈ "సూచనలు'' (మత్తయి 11:4; 16:3), "మహత్కార్యములు'' (హెబ్రీ 2:4; 2:3; 6:5) జరిగించాడు. మానవ పరంగా చూస్తే, దానియేలు ద్వారా వాగ్దానం చేసినదంతా స్థాపించబడటానికి సమస్తం సిద్ధంగా ఉంది. దైవికమైన ఆ రాజును ఆహ్వానించి, ఆయన్ని అంగీకరించడానికి కావలసిన నమ్మకమైన హృదయాలు తప్ప మరేదీ లోటుగా లేదు. అవును ఇదే కొదువగా ఉంది, "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు'' (యోహాను 1:11).

## పరలోక రాజ్యం గురించి మూడు అంశాలు:

ఇక్కడ సి.ఐ.స్కోఫీల్డ్ రిఫరెన్సు నోట్సు సహాయం తీసుకుందాం. మత్తయి సువార్తలో పరలోకరాజ్యం గురించి మూడు అంశాలను గమనిద్దాం (ఎ) "సమీపించియున్నది.'' మత్తయి 3:2లో బాప్తిస్మమిచ్చే యోహాను పరిచర్య ప్రారంభంనుండి రాజును తిరస్కరించడం, మత్తయి 12:46-50 వరకు వివరించిన నూతన సహోదరత్వం వరకు, (బి) నేటి యుగంలో నెరవేర్చబడాల్సిన ఏడు "పరలోకరాజ్య మర్మాలు'' మత్తయి 13:1-52 నుండి మత్తయి 13



అధ్యాయం తరువాత కనిపించే పరలోకరాజ్యం గురించి ఉపమానాలు, నేటి యుగంలోని క్రైస్తవ ప్రకటనకు సంబంధించినవి. (సి) భవిష్యత్తు గురించినది - రాజు తన మహిమతో తిరిగి వచ్చిన తరువాత స్థాపించబోయే రాజ్యం (మత్తయి 24:29-25:46; లూకా 19:12-19; అపొ.కా. 15:14-17; లూకా 1:33; 1కొరింథీ 15:28).

## పరలోక రాజ్యం, దేవుని రాజ్యం మధ్య వ్యత్యాసం:

దేవుని రాజ్యం, పరలోక రాజ్యం మధ్య ఆరు వ్యత్యాసాలు చూడవచ్చు:

(1) దేవుని రాజ్యం విశ్వవ్యాప్తమైనది. దీనిలో ఇష్టపూర్వకంగా దేవుని చిత్తానికి విధేయులయ్యే ఎలాంటి నైతిక వ్యవస్థలైనా, అంటే దేవదూతలు, సంఘం, గతించిన, భవిష్యత్తు తరాల్లోని పరిశుద్ధులు కలిసి ఉంటారు (లూకా 3:28,29; హెబ్రీ 12:22,23). పరలోక రాజ్యం అయితే మెస్సీయ రాజ్యం, మధ్యంతరమైనది, దావీదు వంశానికి చెందినది. దాని గురి అంతా ఈ భూమిపై దేవుని రాజ్యస్థాపన (1కొరింథీ 15:24,25).

(2) కేవలం నూతన జన్మ ద్వారానే దేవుని రాజ్యంలో ప్రవేశం లభిస్తుంది (యోహాను 3:3, 5-7).

(ఎ) దేవుని రాజ్యాన్ని 'చూడలేని' 'ప్రవేశించలేని' ప్రకృతి సంబంధియైన మానవునియొక్క అసమర్ధతలోనుండి నూతన జన్మ అవసరత జనించింది. ఎన్ని తలాంతులు కలిగినా, నైతికంగా ఎంత ఉన్నతుడైనా, వన్నెకెక్కినవాడైనా ప్రకృతి సంబంధియైన వ్యక్తి ఎప్పుడూ ఆధ్యాత్మిక సత్యాన్ని గ్రహించలేని గ్రుడ్డివాడే; దేవుని రాజ్యంలో ప్రవేశించడానికి అసమర్దుడే. ఎందుకంటే అతడు దేవునికి లోబడలేడు, ఆయన్ని అర్థం చేసుకోలేడు, ఆయనను సంతోషపెట్టలేడు (యోహాను 3:3, 5,6; కీర్తన 51:5; యిర్మీయా 17:9; మార్కు 7:21-23; 1కొరింథీ 2:14; రోమా 8:7,8; ఎఫెసీ 2:3).

(బి) నూతన జన్మ అనేది పాత స్వభావం యొక్క సంస్కరణ కాదు, అది పరిశుద్ధాత్మ చేసే ఒక సృజనాత్మక కార్యం (యోహాను 3:5; 1:12,13; 2కొరింథీ 5:17; ఎఫెసీ 2:10; 4:24).

(సి) నూతన జన్మ యొక్క స్థితి సిలువవేయబడిన క్రీస్తులో విశ్వాసముంచటం (యోహాను 3:14,15; 1:12,13; గలతీ 3:24).

(డి) నూతన జన్మద్వారా విశ్వాసి క్రీస్తు యొక్క జీవం, ఆయన దైవిక స్వభావంలో పాలిభాగస్తుడవుతాడు (గలతీ 2:20; ఎఫెసీ 2:10; 4:24; కొలస్సీ 1:27; 1పేతురు 1:23-25; 1యోహాను 5:10-12).

(3) ఈ యుగంలో పరలోక రాజ్యం అంటే ఒక ప్రకటనపై ఆధారపడింది, అది నిజమైనా, అబద్ధమైనా (మత్తయి 25:1,11,12). నూతన జన్మ అనుభవం లేకుండానే దానిని నమ్మే వ్యక్తులు పరలోక రాజ్యంలో ప్రవేశించడానికి అవకాశం ఉన్నదని ఈ క్రింది వచనాల ద్వారా తెలుసుకోవచ్చు.

(4) పరలోక రాజ్యం విశ్వవ్యాపితమైన దేవుని రాజ్యానికి ఈ భూమిపై ప్రతినిధి కాబట్టి ఈ రెంటిలోను అనేక విషయాలు ఒకదానితో ఒకటి సమంగానే ఉన్నాయి. ఈ కారణంగానే అనేక ఉపమానాలు, బోధలు, మత్తయిలో పరలోకరాజ్యం గురించీ, మార్కు, లూకా సువార్తల్లో దేవుని రాజ్యం గురించీ వ్రాయబడ్డాయి. అయితే ఏవైతే విడిచిపెట్టబడ్డాయో అవి చాలా ప్రాముఖ్యం. మత్తయి 13:24-30, 36-43, 47-50 లోని గురుగులు, వల ఉపమానాలు దేవుని రాజ్యం గురించి చెబుతున్నాయి. ఆ రాజ్యంలో గురుగులు గాని, చెడ్డ చేపలు గానీ లేవు. కాని మత్తయి 13:33లోని పులిసిన పిండి ఉపమానం దేవుని రాజ్యం గురించి బోధిస్తోంది. విచారం ఏమిటంటే రాజ్యం గురించిన నిజమైన సిద్ధాంతాలు పరిసయ్యులు, సద్దూకయ్యులు, హేరోదియనులనే తప్పుల ద్వారా పులిసిపోయాయి.

(5) దేవునిరాజ్యం ''ప్రత్యక్షముగా రాదు'' (లూకా 17:20) అది అంతరంగమైనది, ఆధ్యాత్మికమైనది (రోమా 14:17). అయితే పరలోక రాజ్యం ఈ భూమిపై మహిమతో ప్రత్యక్షమయ్యేది (జకర్యా 12:8; లూకా 1:31-33; 1కొరింథీ 15:24; మత్తయి 17:2).

(6) క్రీస్తు తన శత్రువులనందరినీ తన కాళ్ళక్రింద త్రొక్కివేసి "తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించిన" తరువాత (1కొరింథీ 15:24-28) పరలోక రాజ్యం దేవుని రాజ్యంలో కలిసిపోతుంది.



## ఉపమానాలు చెప్పడంలోని ఉద్దేశం

ప్రభువైన యేసుక్రీస్తు ఉపమానాల్లో బోధించడానికి కనీసం నాలుగు కారణాలున్నాయి. ప్రవచన నెరవేర్పు, ఆదినుండి ఉన్న మర్మాలను బయలుపరచడానికి, ఆదినుండి ఉన్న మర్మాలను దాచి ఉంచడానికి.

ప్రవచన నెరవేర్పు: దీనిగురించి యెషయా తన గ్రంథంలో రాశాడు. ఈ సమాంతరమైన అంశాలను మత్తయి 13:14-17 లో మనం గమనించగలం. ఈ క్రింది పట్టికలో కఠినహృదయులైనవారికి ప్రవచనం ఏ విధంగా దాచిపెట్టబడిందో, ఇతరులకు ఆ ప్రవచనం ఏవిధంగా వెల్లడి అయ్యిందో చెరి 7 కారణాలు ఇవ్వబడ్డాయి.

| | |
|---|---|
| 1. "ఇందు నిమిత్తము నేను ఉపమాన రీతిగా వారికి బోధించుచున్నాను. ఈ ప్రజలు కన్నులార చూచి, చెవులారా విని, హృదయముతో గ్రహించి... తెలిసికొనరు." | 1. ''మీరు చూచువాటిని చూడ గోరియు చూడకపోయిరి, మీరు వినువాటిని వినగోరియు వినక పోయిరి'' |
| 2. "యెషయా చెప్పిన ప్రవచనము వీరి విషయమై నెరవేరుచున్నది." | 2. ''అనేక ప్రవక్తలును నీతిమంతులును..." |
| 3. "మీరు వినుట మట్టుకు విందురు గాని గ్రహింపనే గ్రహింపరు" | 3. "మీ చెవులు వినుచున్నవి గనుక అవి ధన్యములైనవి" |
| 4. "చూచుట మట్టుకు చూతురుగాని ఎంతమాత్రమును తెలిసికొనరు" | 4. "మీ కన్నులు చూచుచున్నవి గనుక అవి ధన్యములైనవి" |
| 5. "వారి హృదయము క్రొవ్వినది" | 5. "హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నావలన..." |
| 6. "వారి చెవులు వినుటకు మందము లైనవి" | 6. "మీరు వినువాటిని వినగోరియు వినకపోయిరి" |
| 7. "వారు తమ కన్నులు మూసికొని యున్నారు" | 7. ''చూచువాటిని చూడగోరియు చూడకపోయిరి'' |

ఈ భాగమంతా ఒక లోతైన అగాథం లాంటిది అనుకుందాం. ఈ అగాథం మధ్యలో ఈ వాక్యభాగంయొక్క అతి ప్రాముఖ్యమైన భాగం ఉంది.

పై అంశాల్లో 5,6,7 అంశాలు మూలకారణాన్ని మనకు వెల్లడిస్తున్నాయి. వాళ్ళ హృదయకాఠిన్యాన్ని బట్టి వారు యేసు మాటలను వినలేకపోయారు. ఆయన మాటలు వినకపోవడం బట్టి ఆయన ఎవరో చూడలేకపోయారు. ఆయనే మెస్సీయ అని వారు గ్రహించలేకపోయారు. ఫలితంగా తమ మధ్యకు వచ్చిన దేవుని రాజ్యాన్ని వారు చూడలేకపోయారు.

దీన్ని అర్థం చేసుకుంటే గ్రుడ్డివారికి చూపు ప్రసాదించడం అనే అద్భుతంలో దాగిన అంతరార్థం మనకు గ్రాహ్యమవుతుంది. ఇశ్రాయేలు యొక్క ఆధ్యాత్మిక గ్రుడ్డితనానికి అవి భౌతికమైన గుర్తులుగా ఉన్నాయి.

బైబిలులోని మర్మాలు: మత్తయి 13 అధ్యాయంలోని ఎనిమిది ఉపమానాలను మన ప్రభువు "పరలోక రాజ్యము గురించిన మర్మాలు" (మత్తయి 13:11) అని పిలిచాడు. వాటన్నిటినీ కలిపి చూస్తే, ప్రస్తుత యుగంలో మన ప్రభువుయొక్క వ్యక్తిగత పరిచర్యతో ప్రారంభమైన సువార్తతో ప్రారంభించి, మత్తయి 13:40-43 లోని "పంటకోత" యొక్క ఫలితాన్ని వర్ణిస్తున్నాయి. క్లుప్తంగా, దాని ఫలితం ఏమంటే క్రైస్తవ సాక్ష్యంలో కలిసిపోయిన గోదుమలు, గురుగులు, మంచి చేపలు, చెడ్డ చేపలు. ఇదే నేటి క్రైస్తవ్యం. లేఖనాల్లో "మర్మం" అంటే గతంలో దాగి ఉండి, నేడు దైవికంగా ప్రత్యక్షపరచబడిన సత్యం. అయినప్పటికీ దానిలోని ప్రకృతికి అతీతమైన అంశం ఇంకా దాగి ఉంటుంది.

## కొన్ని గొప్ప మర్మాలు:

1. పరలోక రాజ్యం (మత్తయి 13:3-50).
2. ఈ యుగంలో ఇశ్రాయేలు యొక్క గ్రుడ్డితనం (రోమా 11:25).
3. ఈ యుగాంతంలో జీవించుచున్న పరిశుద్ధులు ఎత్తబడటం (1కొరింథీ 15:51,52; 1థెస్స 4:14-17).
4. యూదులు, అన్యులతో కూడిన ఒకే శరీరంగా నూతన నిబంధన సంఘం (ఎఫెసీ 3:1-11; రోమా 16:25; ఎఫెసీ 6:19; కొలస్సీ 4:3).
5. క్రీస్తు వధువుగా సంఘం (ఎఫెసీ 5:28-32).
6. జీవించుచున్న క్రీస్తు (గలతీ 2:20; కొలస్సీ 1:26,27).
7. "దేవుని మర్మమైయున్న క్రీస్తు" అనగా దేవత్వముయొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించడం (కొలస్సీ 2:2,9; 1కొరింథీ 2:7).



8. మానవునిలో దేవుని పోలిక తిరిగి సమకూడే ప్రక్రియలు (1తిమోతి 3:16).
9. ధర్మవిరోధ సంబంధమైన మర్మము (2థెస్స 2:7; మత్తయి 13:33).
10. ఏడు నక్షత్రాలను గూర్చిన మర్మం (ప్రకటన 1:20).
11. బబులోను గూర్చిన మర్మం (ప్రకటన 17:5,7).

ఈ పుస్తకంలో మనం కేవలం పరలోక రాజ్య మర్మాలను మాత్రం ధ్యానించబోతున్నాం.

## విత్తువాని ఉపమానం

మత్తయి 13 అధ్యాయం యేసు తన బోధనా విధానంలో ఉపమానాలను ఉపయోగిస్తానని వివరించాడు. ఈ ఉపమానాలు తమ స్వభావంలో ప్రవచనాత్మకమైనవి. ఈ ఉపమానాల విశ్లేషణలో మనం దేవుని ప్రణాళిక యొక్క భూత, భవిష్యత్, వర్తమానకాలాలలో పరలోక రాజ్యం గురించి రాజుయొక్క వ్యక్తిగత వివరణను కనుగొంటాం. అవి యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి చేసిన పనుల ఫలితాలను వివరించినంతగా రాజ్యం యొక్క శాశ్వతమైన గుణలక్షణాలను వివరిస్తున్నట్లు కనిపించవు. దేవుని ప్రణాళిక నెరవేర్పు యొక్క చారిత్రకమైన ఎదుగుదలకు అవి ప్రవచనాత్మక సారాంశంగా పనిచేస్తున్నాయి. వీటిలో పదే పదే కనిపించే "పరలోక రాజ్యం" సంఘయుగంలోను, వెయ్యేళ్ళ పాలన కాలంలోను, ఆయన అన్నిటిపై విజయం సాధించేటంతవరకు, క్రీస్తు పరిపాలనను సూచిస్తుంది. చిట్టచివరిగా ఓడిపోయేది మరణం. అప్పటి వరకు "రాజ్యమును గూర్చిన వాక్యము" (వ.19) అనగా రాబోతున్న దేవుని రాజ్యం గురించిన సువార్త ప్రకటించబడుతూనే ఉండాలి.

ఈ అధ్యాయంలో ఎనిమిది ఉపమానాలున్నాయి. మొదటి నాలుగింటిని యేసు అన్ని రకాల ప్రజలు కలిసి ఉన్న గుంపుకు బోధించాడు. మిగిలిన నాలుగు ఉపమానాలను తన శిష్యులతో ఏకాంతంగా ఉన్నప్పుడు బోధించాడు. మత్తయి "యేసు ఈ సంగతులను జనసమూహములకు ఉపమానరీతిగా బోధించెను; ఉపమానము లేక వారికేమియు బోధింపలేదు" (వ.35) అని రాశాడు.

ఈ నాలుగు ఉపమానాలు పరలోక రాజ్యం యొక్క బాహ్య లక్షణాలను వివరిస్తున్నాయి. అనగా రాజ్యానికి వ్యతిరేకంగా పాపం ఏ విధంగా పనిచేస్తుంది, దానికి వ్యతిరేకంగా దుష్టుడు ఎంతవరకు అనుమతించబడతాడు అనే

విషయాలు. మిగిలిన నాలుగు ఉపమానాలు పరలోకరాజ్యం యొక్క అంతర్గత లక్షణాలను వర్ణిస్తున్నాయి. ఎనిమిదవ ఉపమానం బోధించడం పూర్తయిన తరువాత మత్తయి రాస్తూ "యేసు ఈ ఉపమానములు చెప్పి చాలించిన తరువాత ఆయన అక్కడనుండి వెళ్ళి (వెళ్ళెను)" అని ముగిస్తున్నాడు.

ఈ ఉపమానాలు ఒకదానికి మరొకదానితో సంబంధం ఉన్న జతలుగా సంఘం యొక్క వివిధ లక్షణాలను వర్ణిస్తాయి:

**మొదటి జత:** *విత్తువాని ఉపమానం (వ.3).* పరలోక రాజ్యం తన పని సమయంలో ఎదుర్కొనే వివిధ రకాలైన వ్యక్తుల గుంపులతో అది కలిగి ఉన్న సంబంధాన్ని సూచిస్తుంది. దీనిలో ప్రభువైన యేసు క్రీస్తును విత్తువానిగా మనం చూస్తాం. *గురుగులు.* దేవుని రాజ్యంతో దుష్టుడు, అతని అనుచరులకు ఉన్న సంబంధాన్ని సూచిస్తున్నాయి. ఈ ఉపమానంలో మొదటి ఉపమానంలోని పనికి వ్యతిరేకంగా లేక దానిలోని విత్తువానికి నకిలీగా సాతాను పనిచేయడం చూస్తాం.

**రెండవ జత:** ఆవగింజ *(వ.31)* శత్రువులు ఎంత వ్యతిరేకించినా చిన్న ప్రారంభం నుండి త్వరితంగా ఎదిగిపోయిన పరలోకరాజ్యాన్ని సూచిస్తున్నది. పులిసిన పిండి *(వ.33).* అంటువ్యాధిలా వ్యాపించే పాపం ఎంతగా ప్రబలినా దానిని ఎదిరించి ఎదుగుతూ ఉండే పరలోక రాజ్యాన్ని సూచిస్తున్నది.

**మూడవ జత:** *ధన నిధి (వ.44).* ఒక రాజ్యంగా ఇశ్రాయేలు క్రీస్తుకు ఎంత విలువైనదో మనకు సూచిస్తున్నది. ఆయన దానిలో దాగి ఉన్న విలువను గుర్తించి దానికోసం తనకు కలిగినదంతా అమ్మివేశాడు. మంచి ముత్యం *(వ.45)* క్రీస్తుకు సంఘం ఎంత ప్రశస్థమైనదో సూచిస్తున్నది. ఆయన దానిని సంపాదించుకోవడం కోసం తన సమస్తాన్ని ధారపోశాడు.

**నాల్గవ జత:** వల *(వ.47)* వెయ్యేళ్ళ పాలనలో అన్యజనాంగం గురించి బోధిస్తున్నది. ఆ సమయంలో ఈ భూమిపై మంచి చెడులు రెండూ కలిసే ఉంటాయి కాని తీర్పు సమయంలో అవి వేరు చేయబడతాయి. *ఇంటి యజమాని (వ.52)* ఉపమానం దేవుని రాజ్యం గురించిన మర్మాలను గ్రహించి తన ఆధ్యాత్మిక ధననిధిలోనుండి తన ఇంటివారికి అవసరమైన, మంచి పదార్థాలను అందించే వ్యక్తి పరిచర్యను సూచిస్తున్నది.



మొత్తానికి ఈ ఉపమానాలన్నీ పరలోకరాజ్యపు గుణలక్షణాలను, దాని క్రియాశీలతను గురించీ, దానికున్న అడ్డంకులను గురించీ, అంతిమంగా దాని విజయాన్ని గురించీ వర్ణిస్తున్నాయి. క్రీస్తువారి మొదటి, రెండవ రాకడల మధ్యకాలంలో ఆయన తన శిష్యుల ద్వారా రాజ్యం గురించిన సందేశాలను బోధిస్తున్న విధానం వీటిద్వారా మనకు తెలుస్తున్నది. "ఏడవ దూత బూర ఊదినప్పుడు పరలోకములో గొప్ప శబ్దములు పుట్టెను. ఆ శబ్దములు - ఈ లోకరాజ్యములు మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తురాజ్యమునాయెను; ఆయన యుగయుగములవరకు ఏలుననెను" (ప్రకటన 11:15).

వీటిలో మొదటి ఉపమానం "విత్తువాడు", ఎనిమిదవదైన "ఇంటి యజమాని" ఉపమానాలు కీలకమైనవి. మొదటిది మిగిలిన ఉపమానాలన్నిటికీ ఒక పరిచయంగాను, చివరిది వాటన్నిటినీ క్రోడీకరించిన ఒక ముగింపుగాను క్రీస్తు ఆధిపత్యం క్రింద ఉన్న రాజ్యం యొక్క ఉద్దేశం, దాని బాధ్యతలను వివరిస్తున్నాయి. "వీటన్నిటిని మీరు గ్రహించితిరా?" అని ఆయన తన శిష్యులను అడిగాడు. వారు వాటిని అర్థం చేసుకున్నారని చెప్పిన తరువాత మాత్రమే ఆయన తన చివరిదైన "పరలోకంలో శిష్యుడుగా చేరిన ప్రతి శాస్త్రి" గురించిన ఉపమానం వారికి చెప్పి వారి బాధ్యతను గుర్తుచేశాడు. అపొస్తలులు, యేసు స్థాపించబోయే సంఘం "క్రొత్త పదార్థములను పాత పదార్థములను" వెలికి తెచ్చే జ్ఞానం అనే ధననిధిని వెలుపలికి తెస్తారు.

క్లుప్తమైన, సరళమైన తన ఉపమానాల ద్వారా సూటిగా, సంక్షిప్తంగా ఉండటం అనేవి సమర్థమైన బోధనా పరికరాలు అని యేసు మనకు బోధిస్తున్నాడు. ఆయన పద్ధతి అతి లోతుగా, దీర్ఘంగా ఉండే కొందరు బైబిలు వ్యాఖ్యానకర్తల ధోరణికి పూర్తిగా భిన్నంగా ఉంది. ఆయన తన బోధ వింటున్న ప్రజలు తేలికగా అన్వయించుకునే విధంగా స్పష్టమైన, సూటియైన ఉదాహరణలతో బోధించాడు. వ్యవసాయసంబంధమైన జీవితాన్ని గురించి రైతులు చక్కగా అర్థం చేసుకున్నారు. ఇంటిలో సామాన్యంగా ఉండే జీవిత ఉదాహరణలను స్త్రీలు సులభంగా గ్రహించారు. వ్యాపారసంబంధమైన ఉదాహరణలను వ్యాపారస్తులు ఆధ్యాత్మిక సిద్ధాంతాలతో చక్కగా అన్వయించుకోగలిగారు. యేసు సాధారణమైన పౌర బాధ్యతలు, సామాజిక అంశాలను కూడా స్పృశించాడు. ప్రకృతిసంబంధ విషయాలను కూడా ఆయన

ఆధ్యాత్మిక సత్యాలను వెల్లడించడానికి ఉపయోగించుకున్నాడు. ఆయా సందర్భాలకు సరిగ్గా అతికినట్టుగా, వాటి సహజత్వం ఏమాత్రం చెడిపోకుండా సాదృశ్యాలను యేసు ఉపయోగించాడు. ఈ ఉపమానాల్లోని నిజమైన ఆధ్యాత్మిక సూత్రాలను కేవలం ఆయన శిష్యులు మాత్రమే అర్థం చేసుకోగలిగారు. ఎందుకంటే "పరలోక రాజ్య మర్మములు ఎరుగుట మీకు అనుగ్రహింపబడి యున్నది'' (వ.11). పరలోకంలోని ఆయన తండ్రి ద్వారా వారు ప్రేరేపించబడ్డారు. "ఎందుకనగా నేను నా తండ్రివలన వినిన సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని'' (యోహాను 15:15). కాబట్టి "మీ కన్నులు చూచుచున్నవి గనుక అవి ధన్యములైనవి, మీ చెవులు వినుచున్నవి గనుక అవి ధన్యములైనవి'' (మత్తయి 13:16).

### విత్తువాని ఉపమానం:

**చదవదగిన వాక్యభాగం:** "వాడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కను పడెను; పక్షులు వచ్చి వాటిని మ్రింగివేసెను'' (మత్తయి 13:4). "ఎవడైనను రాజ్యమును గూర్చిన వాక్యము వినియు గ్రహింపకయుండగా దుష్టుడు వచ్చి వాని హృదయములో విత్తబడినదానిని యెత్తికొనిపోవును; త్రోవప్రక్కను విత్తబడినవాడు వీడే'' (మత్తయి 13:19). "వాడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవప్రక్కను పడెను. పక్షులు వచ్చి వాటిని మ్రింగివేసెను'' (మార్కు 4:4). "త్రోవప్రక్కనుండు వారెవరనగా, వాక్యము వారిలో విత్తబడును గాని వారు వినిన వెంటనే సాతాను వచ్చి వారిలో విత్తబడిన వాక్యమెత్తికొనిపోవును'' (మార్కు 4:15). "అతడు విత్తుచుండగా కొన్ని విత్తనములు త్రోవప్రక్కను పడి త్రొక్కబడెను గనుక ఆకాశపక్షులు వచ్చి వాటిని మ్రింగివేసెను'' (లూకా 8:5). "విత్తనము దేవుని వాక్యము. త్రోవప్రక్కనుండువారు, వారు వినువారు గాని నమ్మి రక్షణ పొందకుండునట్లు అపవాది వచ్చి వారి హృదయములోనుండి వాక్యమెత్తికొనిపోవును'' (లూకా 8:11,12). ఈ విత్తువాని ఉపమానంలో (మత్తయి 13:3-9, 19-23; మార్కు 4:3-9, 14-20; లూకా 8:4-8, 11-15) రాజ్యము గురించిన సందేశాన్ని వినేవారిలో ప్రతి ఒక్కరు ఎందువలన ఒకే విధంగా దానిని అంగీకరించరు అనే విషయాన్ని యేసు వివరించాడు.



పిలువబడినవారు తమ మనస్సులను వాక్యానికి తెరచి ఉంచుతారు. పరిశుద్ధాత్ముడు వారు దాన్ని గ్రహించగలిగేలా చేస్తాడు. అయినా చాలామంది కేవలం దానిని పైపైనే అంగీకరిస్తారు గాని లోతుగా తీసుకోరు. వివిధరకాల వ్యక్తుల గుంపులకు, రాజ్యానికి ఉన్న విభిన్నమైన సంబంధాలను ఈ ఉపమానం వివరిస్తుంది. ఆ భేధాలను సూచించడానికి యేసు విత్తువాడు, విత్తనం, నేల అనే మూడు రకాల అంశాలను వాడాడు. ఈ కథలో విత్తబడిన విత్తనం, అది పడిన వివిధ రకాల నేల, దాని ఫలితాలు వివరించబడ్డాయి. యేసు దీనిని "విత్తువాని ఉపమానం'' (మత్తయి 13:18) అని పిలిచినా దాని వస్తువు మాత్రం విభిన్నమైన నేలల గురించిన వర్ణన. అలాగని దీనిలో విత్తువానికి ప్రాధాన్యత ఏమీ లేదని కాదు. అసలు అతడు లేకపోతే విత్తనాలు చల్లటం, తత్ఫలితంగా పంట పండటం, ఇవేవీ ఉండవు కదా. ఈ ఉపమానంలో విత్తువాడు యేసుక్రీస్తును సూచిస్తున్నాడు (మత్తయి 13:37). ఇక్కడ వాడిన భాష అలాంటి మరే ఇతరమైన విత్తువారిని కూడా సూచిస్తున్నది కాబట్టి దేవుని పరిచారకులంతా సువార్తను విత్తేవారిగా పరిగణించబడ్డారు. మత్తయి సువార్త 13 అధ్యాయంలోని ఇతర ఉపమానాలన్నింటికీ ఈ విత్తువాని ఉపమానం తలమానికంగా, పరిచయంగా ఉంది కాబట్టి దీనిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

### 1. త్రోవప్రక్కన పడిన విత్తనాలు (వ.4,19).

ఉపమానాన్ని, దాని వివరణను పోల్చి చూస్తే ఈ త్రోవప్రక్కన పడిన విత్తనాలు రాజ్యమును గూర్చిన వాక్యాన్ని వినినప్పటికీ దాని సందేశాన్ని అర్థం చేసుకోలేని క్రైస్తవులను సూచిస్తున్నాయి. ఆ సందేశాన్ని అర్థం చేసుకోవడంలోని వారి వైఫల్యం "దుష్టుడైన సాతాను'' కు సూచనగా ఉన్న "పక్షులు'' వచ్చి ఆ విత్తనాలను ఎత్తుకొనిపోవడం ద్వారా ఆ వ్యక్తిని మ్రింగివేసేందుకు తావిచ్చింది (వ.4,19; 1పేతురు 5:6-9 తో పోల్చండి).

ఈ విధంగా త్రోవప్రక్కన పడిన విత్తనాలను, నేటి రాజ్యపు వాక్యంతో పోలిస్తే అవి ఈ సందేశం వింటున్న క్రైస్తవులలో అధిక సంఖ్యాకులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. వారికి సందేశాన్ని అర్థం చేసుకోగలిగిన సామర్థ్యం ఉన్నా (ఎందుకంటే వారికి ఆధ్యాత్మిక జీవం ఉంది), వారు దానిపై అతి తక్కువ ఆసక్తి చూపించడం, లేక అసలు ఆసక్తే లేకపోవడం ద్వారా సాతాను ప్రవేశించి తన విధ్వంసకమైన, మ్రింగివేసే కార్యం జరగడానికి అవకాశం కల్పిస్తున్నారు.

క్రీస్తు ఈ లోకానికి మొదటగా వచ్చినపుడు ఇశ్రాయేలు లోని మతనాయకులు నాటి ప్రజలను దారి తప్పించారు (మత్తయి 12:9-32; 15:1; 16:1; 23:13,15). తత్ఫలితంగా నాటి ఇశ్రాయేలు ప్రజల క్రియల్లో ప్రవక్తయైన యెషయా ప్రవచనాలు నెరవేరాయి.

"వారి హృదయము క్రొవ్వినది, వారి చెవులు వినుటకు మందములైనవి, వారు తమ కన్నులు మూసికొనియున్నారు" (మత్తయి 13:15 ను యెషయా 6:9,10తో పోల్చండి). యూదులు దేవుని వాక్యాన్ని కలిగి ఉండటమే కాక వారు ఆధ్యాత్మిక అవగాహన కలిగిన ప్రజలు. ఈ వాక్యాన్ని అర్థం చేసుకోడానికి వారు పూర్తిగా సమర్థులు. కాని నాటి మత నాయకులు (ఛాందసులైన మత నాయకులు - పరిసయ్యులు) ప్రజలను తప్పుత్రోవ పట్టించారు. తత్ఫలితంగా యూదా ప్రజలు మొట్టమొదటిసారి ఆ సందేశం విన్నపుడు వారి స్పందన విత్తువాని ఉపమానంలో ఈ మొదటి వర్గం (త్రోవప్రక్కన పడినవి) వారికి ఏమాత్రం భిన్నంగా లేదు. రెండువేల సంవత్సరాల క్రితం ఉన్న ఈ పరిస్థితి సరిగ్గా నేటి క్రైస్తవ్యంలో కూడా మనం చూస్తాం. మతనాయకులు ప్రజలను దారితప్పిస్తున్నారు. గ్రుడ్డితనంలో ఉన్న ఇశ్రాయేలు ఆ సందేశానికి చెవియొగ్గలేదు. అదే విధంగా నేటి సంఘంలోని మతనాయకులు సహితం ఆ సందేశాన్ని అంగీకరించలేదు. అయితే ఇశ్రాయేలులో ఆనాడు కొద్దిమంది వ్యక్తులు ఆ సందేశాన్ని అంగీకరించారు, వారి కన్నులు తెరవబడ్డాయి (మత్తయి 13:15, 16 లను లూకా 24:16,31 తో పోల్చండి). అదే విధంగా నేటి క్రైస్తవ్యంలో సహితం కొద్దిమంది వ్యక్తులు సువార్త విని అంగీకరించడం వలన వారి కన్నులు కూడా తెరవబడ్డాయి, తెరవబడుతున్నాయి (2కొరింథీ 3:14-18; ప్రకటన 3:18 పోల్చండి).

మనం దేవుని వాక్యాన్ని అందించినపుడు "సత్యమును ప్రత్యక్షపరచుట వలన" "ప్రతి మనుష్యుని మనస్సాక్షి" పైన ప్రభావం చూపగలిగేలా జాగ్రత్త తీసుకోవాలి (2కొరింథీ 4:2). ఒకసారి ఎదుటివారికి స్వచ్ఛమైన సత్యాన్ని మనం అందించాం అని రూఢిపరచుకున్న తరువాత "వారి మనోనేత్రాలు వెలిగింపబడేలా" (ఎఫెసీ 1:18) వారికోసం ప్రార్థించాలి. 'వెలిగింపబడుట' అనేది ఆత్మ ద్వారా కలుగుతుంది (1కొరింథీ 2:10), అది హృదయంలో కలుగుతుంది (1కొరింథీ 2:9). హృదయం విధేయత చూపి దేవునివైపు తిరిగితే ఇక తెర తొలగినట్లే. ఆ వెలిగింపు దేవుడు మనకోసం సిద్ధపరచినవాటిని గూర్చి మనకు బయలుపరుస్తుంది (1కొరింథీ 2:9). వెలిగింపు మనకు కనీసం నాలుగు అంశాల్లో కలుగుతుంది. (1) దేవుణ్ణి తెలుసుకోవడం (ఎఫెసీ 1:17), (2) దేవుని పిలుపు (ఎఫెసీ 1:18), (3) దేవుని మహిమైశ్వర్యము (ఎఫెసీ 1:18), (4) దేవుని శక్తి (ఎఫెసీ 1:19-23). దేవుని వాక్యం ఈ నాలుగు విషయాల్లో విశ్వాసిని వెలిగించటమే కాక అది రెండంచులు గల ఖడ్గంలాగా ప్రాణాత్మలను కీళ్ళను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధిస్తుంది (హెబ్రీ 4:12). వ్యక్తి బాధ్యతల్లా తన హృదయాన్ని దేవునివైపు త్రిప్పి ఆయన చిత్తానికి విధేయత చూపడమే. అతడలా చేయకపోతే అతడు త్రోవప్రక్కన పడి ఉన్న ఒక గ్రుడ్డివానిలాంటివాడు. అపవాది అతనిపై బడి అతని హృదయం నుండి విత్తనాన్ని ఎగరేసుకొనిపోతాడు. అతడు చీకటిలో నివసిస్తాడు (2పేతురు 1:4-11).

## 2. రాతినేలను పడిన విత్తనాలు (వ.5,6,20,21)

ఉపమానాన్ని, దాని వివరణను పోల్చినపుడు (వ.5,6,20,21) రాతినేలను పడిన విత్తనాలు వాక్యాన్ని విని, దానిని అర్థం చేసుకొని దానిని సంతోషంతో అంగీకరించినవారిని సూచిస్తున్నాయి. ఈ వ్యక్తులు తాము విని నేర్చుకున్నదాని విషయమై ఎంతో ఆశ్చర్యానందాలకు లోనవుతారు. "రాజ్యం గురించి వాక్యము" ద్వారా వారి జీవితాల్లో నూతనమైన సంతోషాన్ని, ఉత్సాహాన్ని వారు కనుగొన్నారు (వ.20).

అయితే వారు ఆ వాక్యంలో సరిపడినంతగా పాదుకొని నిలబడక ముందే (వారిలో "లోతైన మన్ను" లేదు, లేక వారికి "వేరులు లేవు") "శ్రమ, హింస" వారిపై ప్రభావం చూపుతాయి. వారు కొంతకాలం నిలబడతారు కాని "సూర్యుడు (శ్రమ, హింసలు) ఉదయించినప్పుడు అవి మాడి వేరులేనందున (విశ్వాసంలో పరిణతి లేకపోవడం) ఎండిపోతారు (వ.5,6,21).

ఈ పాఠంలో "హింస, శ్రమ" అనేవి "దేవుని వాక్యం వలన" కలుగుతాయి. అంటే వ్యక్తులు రాజ్య సందేశం విని అంగీకరించడం వలన. రాబోయే క్రీస్తు రాజ్య సందేశం గురించి సాతాను మనపై దాడిచేసేటంతగా మరే సందేశం గురించీ చేయడు.

ఈ సందేశం ప్రముఖంగా ఈ భూమిపై ప్రభుత్వంలో మార్పుకు సంబంధించినదై ఉంటుంది. ఇప్పుడున్న పరలోకాల రాజ్యం లోపలే సాతాను, వాడి దూతలు ఈ భూమిపై ప్రస్తుతం రాజ్యం చేస్తున్నారు. అయితే త్వరలో నూతనమైన రాజ్యాధిపతులు రాబోతున్నారు - వారు క్రీస్తు, ఆయన సహాధిపతులు. సాతాను, వాడి దూతలు అణగద్రొక్కబడి, క్రీస్తు, ఆయన తోడి వారసులు రాజ్యంపై పూర్తి ఆధిపత్యం సాధిస్తారు.

రాజ్య సందేశం యొక్క అంతిమ ఉద్దేశం ఇదే. రాబోయే ఆ దినాన క్రీస్తు ఈ భూమిపై సాతానుకు బదులుగా రాజ్యం ఏలటం. అలాగే సాతాను యొక్క దూతల స్థానంలో క్రీస్తుకు సహవారసులుగా క్రైస్తవులు తమ స్థానాలను అధిష్ఠించడం. అయితే అది జరగకుండా అడ్డుకోడానికి సాతాను తన శక్తినంతా ధారపోస్తాడు. కాబట్టి లేఖనం అందిస్తున్న ఈ సందేశం మరే సందేశమూ ఎదుర్కోని విధంగా తప్పనిసరిగా ఆటంకాలను ఎదుర్కొంటుందని రూఢిగా చెప్పవచ్చు. ఎఫెసీ 3:1-11 లో ఈ సందేశం "పరలోకములో ప్రధానులకును అధికారులకును (సాతాను, వాడి దూతలు) సంఘము ద్వారా" ప్రస్తుతం బయలు పరచబడుచున్నది అని చెప్పబడింది. ఈ సందేశం సాతాను, వాడి దూతలు అధికారంనుండి తప్పించబడతారని, పరిశుద్ధాత్ముడు, వాక్యంద్వారా ఇచ్చే ఆహ్వానానికి ఎవరైతే సానుకూలంగా స్పందిస్తారో వారు ఆ రాబోయే దినాన క్రీస్తుయొక్క రాజ్యాధికారంలో పాలుపంచుకుంటారని సూచిస్తున్నది (ఆది 24:36,59తో పోల్చండి). సంఘం ద్వారా సాతాను, వాడి దూతలకు బయలు పరుస్తున్న ఈ సందేశం వలన జరుగుతున్న గొప్ప ఆధ్యాత్మిక పోరాటం గురించి ఎఫెసీ 6:1లో చదువుతాం.

మొట్టమొదటిగా క్రైస్తవులు ఈ సందేశం వినకుండా చేయడానికి సాతాను తన సర్వశక్తులూ ఒడ్డితీరుతాడు. అప్పటికే ఈ సందేశాన్ని విన్న క్రైస్తవులలోనుండి ఆ సందేశాన్ని ధ్వంసం చేసి వారిని మ్రింగివేయడానికి ప్రయత్నిస్తాడు. వాక్యాన్ని విని, దానిని అర్థం చేసుకునేవారి జీవితంలో ఈ సమయంలో సాతాను "శ్రమను, హింసను" తీసుకొస్తాడు. ఈ వాక్యభాగాన్ని మరొకసారి గమనించండి. అలాంటివారి జీవితంలో కలిగే ఆ శ్రమలు, హింసలు వారు దేనినైతే విని సంతోషంతో అంగీకరించారో ఆ "వాక్యము నిమిత్తము" కలుగుతాయి.



అంతేగాక, ఈ శ్రమలు, హింసలు ఇతర క్రైస్తవులనుండి కూడా తప్పనిసరిగా కలుగుతాయి. ఈ లోకంలో రక్షింపబడని వ్యక్తులకు దీనంతటితో ఏమాత్రం సంబంధం లేదు. వారు "తమ పాపములలో అపరాధాల్లో చచ్చినవారు", ఆధ్యాత్మిక పరిధిలో వ్యవహరించడానికి ఏమాత్రం సామర్థ్యం లేనివారు. రెండువేల సంవత్సరాల క్రితం ఇశ్రాయేలు దేశంలో జరిగినట్లుగా ఈ శ్రమలు, హింసలు సాటి క్రైస్తవులనుండి రావడమే కాక మరింత సూటిగా చెప్పాలంటే నాటి ఇశ్రాయేలు దేశంలో జరిగినట్లుగా అవి నాయక స్థానాల్లో ఉన్నవారినుండి కలుగుతాయి (ఉదా. యోహాను 9:22). ఇలాంటి విశ్వాసిలో విత్తబడిన వాక్యం ఫలించదు. అతడు తన భావోద్రేకాలకు ప్రాధాన్యతనిచ్చి, ఈ లోకంలో ఉన్న వివిధ రకాల బోధలవలన అటూ ఇటూ కొట్టుకొనిపోతాడు (ఎఫెసీ 4:14). వానిలోని అంతరంగ పురుషుడు శక్తిమంతుడుగా ఉండాలని, క్రీస్తు అతని హృదయంలో నివసించాలని మనం ప్రార్థించాలి (ఎఫెసీ 23:16,17). ఈ వచనంలో "నివసించడం" అంటే (ఎ) స్థిరంగా ఒక్కచోట నిలిచి ఉండటం (బి) ఏదో పైపై సంబంధాలు కాక ఒక లోతైన సహవాసం కలిగి ఉండటం. తమ శిరస్సు అయిన క్రీస్తుకు హత్తుకొని ఉండక, ఈ వ్యక్తులు తమ భావోద్రేకాలకు, వివిధరకాలైన బోధలకు ప్రాధాన్యతనిస్తారు. వారు విని, అర్థం చేసుకుని అంగీకరించిన బోధ పొరబాట్లతోను, దుర్బోధతోను నిండినది. ఆ విధంగా విశ్వాసంలో తగినంత పరిణతి లేని కారణంచేత అతడు వెలిగింపబడని కన్నులతో పడి ఉండి అణగద్రొక్కబడతాడు. ఎటువంటి ప్రతిఘటనా లేకుండానే అతడు లొంగిపోతాడు. తన విశ్వాసాన్ని విడిచిపెట్టి దిగజారిపోతాడు. సాతాను అతని జీవితంపై విజయవంతంగా ఆధిపత్యం చెలాయిస్తాడు.

### 3. ముండ్ల పొదలలో పడిన విత్తనాలు (వ.7,22)

ఉపమానాన్ని, దాని వివరణను పోల్చిచూసినప్పుడు (వ.7,22) ముండ్ల పొదలలో పడిన విత్తనాలు దేవుని వాక్యాన్ని విని, జీవనసంబంధమైన విచారముల చేత అణచివేయబడి ఫలించలేకపోయిన వ్యక్తులకు సూచనగా ఉన్నాయి. "కాలము గడచిన కొలది" (లూకా 8:14) అనే మాట వారు కొంతకాలం నిలిచి ఉన్నప్పటికీ చివరికి శత్రువుచేత అణచివేయబడతారని సూచిస్తున్నది. దీనికి కారణం ఐహిక విచారములు, ధనమోసములు. లూకా దీనికి మరొక కారణం కలిపాడు. అది, "ధనభోగములు" (లూకా 8:14).

ఈ వ్యక్తులు తమ అపరిపక్వత, నిర్లక్ష్యం, సరిగా కాపాడుకోకపోవడం, ఇలా ఏ కారణం చేతనైనా గాని సాతాను ఆధిపత్యం క్రింద ఉన్న ఈ ప్రస్తుత లోకవ్యవస్థలోని వివిధ రకాల చెడుతనాన్ని తమలోకి అనుమతించి పతనమై పోతారు (1యోహాను 2:15-17). సాతాను వాటిని తన ఆధ్యాత్మిక పోరాటంలో వారిపై ప్రయోగిస్తాడు.

క్రైస్తవులు తమ మనస్సులను, కనులను, హృదయాన్ని దేనిపై నిలిపి ఉంచుకోవాలో అని ప్రభువు చేసిన గద్దింపులు, హెచ్చరికలను వారు పెడచెవిని పెడతారు. క్రైస్తవులు తమ విశ్వాస పరుగుపందెంలో "యేసువైపు" చూడాలి (హెబ్రీ 12:1,2). వారు ప్రస్తుత లోకవ్యవస్థకు చెందిన విషయాలపై "నుండి" తమ దృష్టి మరల్చుకొని యేసు "వైపు" చూడాలి. వెనుదిరగ కూడదు. తమ చుట్టూ జరుగుతున్న దానిపై కాక కేవలం తమ విశ్వాసానికి కర్త, దానిని కొనసాగించేవాడు అయిన యేసువైపే సూటిగా దృష్టించాలి. అలాగే కేవలం యేసువైపు మాత్రమే కాక క్రీస్తు ఏ విధంగా ఆ కల్వరిలో శ్రమలు, అవమానం భరిస్తూ దేనిపైనైతే తన దృష్టినుంచాడో దానిపై కూడా మనం మన చూపు నిలపాలి. ఆయన తనయెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించాడు (హెబ్రీ 12:2; 1పేతురు 2:21).

క్రైస్తవులు వెనుదిరిగి చూడకుండా, ఈ చదును భూమి (ప్రస్తుత లోక వ్యవస్థకు సూచన) పైనే నిలిచి ఉండకుండా, "పర్వతానికి పారిపోవాలి" (రాజ్యానికి సూచన). వారలా చేయకపోతే ఈ లోకంలోని వస్తువులతోబాటు దహించివేయ బడతారు (ఆది 19:17; 19:26; లూకా 9:62; 17:32,33 వచనాలను పోల్చండి). క్రైస్తవులు అటు ఇటూ దిక్కులు చూడకుండా కేవలం తమ రాజుపైన, ఆయన రాజ్యం పైన తమ దృష్టిసారించాలి. భవిష్యత్తులో కలగబోయే మహిమైశ్వర్యము, హెచ్చింపులతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న బాధలను (శ్రమలు, హింసలు), ఈ లోకసంబంధమైన విషయాలను (ఐహిక విచారములు, ధనం, ధనభోగములు) ఎన్నదగనివిగా భావించాలి. ఆ విధంగా వారు చేయకపోతే, సాతాను వాటన్నిటినీ వారిపై ప్రయోగించి వారిని పతనానికి గురిచేస్తాడు.

## 4. మంచినేలపై పడిన విత్తనాలు (వ.8,23)

ఉపమానంలోని నాలుగవ భాగం పూర్తిగా విభిన్నమైన సంగతులను మన ముందుంచుతుంది. మంచినేలపై పడిన విత్తనాలు వాక్యాన్ని విన్నారు



(ఉపమానం మొదటిభాగం), వాక్యాన్ని అర్థం చేసికొని ఏ విధమైన "శ్రమయైనను, హింసయైనను" వారిని క్రిందికి లాగివేయడానికి, లేక వాక్యంలో తమ పరిణతిని అడ్డగించే దేనినీ అంగీకరించలేదు (ఉపమానంలోని రెండవ భాగం). అంతేగాక వారు తమ దృష్టినంతా ప్రస్తుత లోక వ్యవస్థకు చెందిన విషయాలపై కాక కేవలం తమ ముందున్న గురిపైనే సారించారు (ఉపమానంలో మూడవభాగం).

వారు దేవుని వాక్యాన్ని విని, గ్రహించి, దానిలో ఎదిగారు. శ్రమలైనా, హింసలైనా వారిని అడ్డగించలేవు, ఐహిక విచారాలు, ధనమోసం, లోక ఆనందాలు ఏవీ తమను దారితప్పేలా చేయడానికి అనుమతించలేదు. వారు తాము "నియమ ప్రకారం" పోరాడితే తమకోసం కిరీటం ఎదురుచూస్తున్నదని ఎరిగి ఈ "జీవన వ్యాపారములలో చిక్కుకోడానికి" అంగీకరించరు (2తిమోతి 2:4,5).

ఆ విధంగా ఈ వ్యక్తులు అన్నిటినీ అధిగమించి ఫలములు ఫలించేవారు. వీరు లోకానికి (1యోహాను 5:4), శరీరానికి (రోమా 8:13; కొలస్సీ 3:5), అపవాదికి (యాకోబు 4:7; 1పేతురు 5:9) లొంగకుండా వాటిని జయించిన వ్యక్తులు. తత్ఫలితంగా వారు ఫలములు ఫలిస్తారు. ఈ ఉపమానంలో చెప్పబడిన నాలుగు గుంపులలో వీరు మాత్రమే ఫలించేవారు. వారి ఫలం వివిధ స్థాయిల్లో ఉంటుంది. నూరంతలుగాను, అరువదంతలుగాను, ముప్పదంతలుగాను ఫలిస్తారు. ఈ వ్యక్తులు మాత్రమే ఈ లోకంలో తమ జన్మ లేక ఉనికియొక్క ఉద్దేశాన్ని నెరవేర్చేవారు. అదేమంటే ఇశ్రాయేలు విఫలమైనచోట వీరు ఫలించి భవిష్యత్తులో రాబోయే పరలోకరాజ్యంలో క్రీస్తుతో కూడ తమకోసం పదవులు, హోదాలు పొందడానికి అర్హత పొందారు. రాబోయే ఆ దినాన క్రీస్తుతో కూడ సింహాసనాసీనులై ఈ భూమిపై తాము ఫలించిన స్థాయికొద్దీ పరలోకంలో పదవులను అధిష్ఠిస్తారు.

**ఫలించడానికి ఏడు రకాల ఆటంకాలు:** ఇప్పటివరకూ మనం చేసిన ధ్యానంపై ఆధారపడి మనం ఫలించకుండా అడ్డగించే ఏడు అంశాలను పరిశీలిద్దాం.

1. దారిన నడిచిపోయే పాదచారుల వలన గట్టిపడిన హృదయం
2. గాలిలో సంచరించే పక్షులు విత్తనాలను మ్రింగివేయడం వలన ఫలింపు అడ్డగించబడింది

3. వాక్యము నిమిత్తమైన శ్రమలు, హింసలు
4. శోధనల వలన ఫలింపు ఉండదు - ముండ్ల పొదల (లోకసంబంధమైన) హృదయం
5. "ఐహిక విచారములు" (మత్తయి 13:22)
6. "ధనమోసము" (మత్తయి 13:22)
7. "ధనభోగములు" (లూకా 8:14).

పైన చెప్పిన అడ్డంకులను మనం అధిగమించగలిగితే, నీ జీవితంలో కూడా ఈ క్రింది ఫలితాలు కనిపిస్తాయి. ఫలించడం అనేది దేవుని దైవిక సంకల్పం. ఎదుగుతున్న వృక్షం ఏ విధంగా అయితే ఫలాలనిస్తుందో, ఫలించడం అనేది ఆధ్యాత్మిక అభివృద్ధితో సమానంగా ప్రాముఖ్యమైనది. వాక్యంలో అనేక రకాల ఫలాల గురించి చెప్పి ఉంది. వాటిలో కొన్నిటిని పరిశీలిద్దాం.

**ఆత్మల సంపాదన అనే ఫలం:** "సహోదరులారా, నేను ఇతరులైన అన్యజనులలో ఫలము పొందినట్లు మీలో కూడ ఫలమేదైనను పొందవలెనని అనేక పర్యాయములు మీయొద్దకు రానుద్దేశించితిని; గాని యిదివరకు ఆటంకపరచబడితిని. ఇది మీకు తెలియకుండుట నాకిష్టములేదు" (రోమా 1:13).

**పరిశుద్ధత అనే ఫలం:** "అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము; దాని అంతము నిత్యజీవము" (రోమా 6:22).

**ఆత్మఫలము:** "అయితే ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము. ఇట్టివాటిని విరోధమైన నియమమేదియు లేదు" (గలతీ 5:22). "వెలుగు ఫలము సమస్తవిధములైన మంచితనము, నీతి, సత్యమను వాటిలో కనబడుచున్నది" (ఎఫెసీ 5:9).

**మంచి పనులు అనే ఫలం:** "...ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధి పొందుచు, అన్ని విషయములలో ప్రభువును సంతోషపెట్టునట్లు, ఆయనకు తగినట్లుగా నడుచుకొనవలెనని..." (కొలస్సీ 1:10). "ఆలాగుననే ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును,



పనికిమాలిన చెట్టు కాని ఫలములు ఫలించును. మంచిచెట్టు కానిఫలములు ఫలింపనేరదు; పనికిమాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదు" (మత్తయి 7:17,18). "నేను ఈవిని అపేక్షించి యీలాగు చెప్పుటలేదు గాని మీ లెక్కకు విస్తార ఫలము రావలెనని అపేక్షించి చెప్పుచున్నాను" (ఫిలిప్పీ 4:17).

**కృతజ్ఞతార్పణ అనే ఫలం:** "కాబట్టి ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15).

**మారుమనస్సు అనే ఫలం:** "మారుమనస్సుకు తగిన ఫలము ఫలించుడి" (మత్తయి 3:8).

**సంఘానికి చేర్చబడేవారు అనే ఫలం:** "దేశములోను పర్వతశిఖరముల మీదను సస్య సమృద్ధి కలుగును. దానిపంట లెబానోను వృక్షములవలె తాండవమాడుచుండును. నేలమీది పచ్చికవలె పట్టణస్థులు తేజరిల్లుదురు" (కీర్తన 72:16). "విత్తువాడును, కోయువాడును కూడ సంతోషించునట్లు కోయువాడు జీతము పుచ్చుకొని నిత్యజీవార్థమైన ఫలము సమకూర్చు కొనుచున్నాడు" యోహాను 4:36).

**ఫలించడం అనేది ఆధ్యాత్మిక అభివృద్ధిలో అతి కీలకమైన భాగం:** మనం ఉత్పత్తి చేసేవారిగా, ఫలితాలు సాధించేవారిగా ఉండాలని దేవుడు కోరుతున్నాడు. కొన్ని ఉపమానాల్లో ఆధ్యాత్మిక సిద్ధింపు మన యజమాని కొరకు పెట్టుబడిపెట్టి లాభం ఆర్జించడంతో పోల్చబడింది (మత్తయి 25:14-30; లూకా 19:11-27). మరికొన్ని వాక్యభాగాల్లో అది ఒక కట్టడం లేక మందిరం నిర్మాణానికి పోల్చబడింది (1కొరింథీ 3:9-17; ఎఫెసీ 2:19-22).

కాని బైబిలులో ఆధ్యాత్మిక సిద్ధి అనే ప్రక్రియను ప్రముఖంగా సూచించే అంశం ఫలాల ఉత్పత్తి. దేవుడు తన ప్రజలను "బహుగా ఫలించే" (యోహాను 15:5,8) తీగెలుగా పోలుస్తున్నాడు. మనం మన జీవితాంతం వరకు ఎదుగుతూ ఫలిస్తూ ఉండాలి.

క్రీస్తు చెప్పిన అంజూరపు చెట్టు ఉపమానం ఈ సత్యాన్ని నొక్కి వక్కాణిస్తున్నది. ఆధ్యాత్మికంగా, ఫలములు లేని పండ్లచెట్టు పనికిరానిది (లూకా 13:6-9). "కనుక అతడు - ఇదిగో మూడేండ్లనుండి నేను ఈ అంజూరపు

చెట్టున పండ్లు వెదకవచ్చుచున్నాను గాని యేమియు దొరకలేదు; దీనిని నరికివేయుము, దీనివలన ఈ భూమియు ఏల వ్యర్థమైపోవలెనని ద్రాక్షతోట మాలితో చెప్పెను. అయితే వాడు- అయ్యా, నేను దానిచుట్టు త్రవ్వి, యెరువు వేయుమట్టుకు ఈ సంవత్సరము కూడ ఉండనిమ్ము; అది ఫలించిన సరి, లేనియెడల నరికించివేయుమని అతనితో చెప్పెను'' (వ.7-9). ఈ ఉపమానం దేవుడు మనం ఫలించాలని ఎదురుచూస్తున్నాడని చెబుతున్నది. ఒక చెట్టునుండి ఒక కొమ్మ నరికివేయబడితే ఏ విధంగా ఎండిపోయి చనిపోతుందో అలాగే మనం యేసుక్రీస్తునుండి వేరుపడితే ఆధ్యాత్మికంగా మరణిస్తాం. "నాయందు నిలిచియుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనే గాని తనంతట తానే ఏలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచియుంటేనే గాని మీరును ఫలింపరు.... నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు'' యోహాను 15:4-5).

అందుకే దేవుని నిజమైన సంఘంతో సహవాసం కలిగి దానిలో భాగంగా ఉండటం చాలా కీలకమైన సంగతి. ఆ సంఘానికి శిరస్సుగా (కొలస్సీ 1:8) ఎవరైతే తన నడిపింపుకు (ఎఫెసీ 4:11-16) లోబడి ఉంటారో వారందరి ఆధ్యాత్మిక అభివృద్ధికై యేసు తానే వారిని నడిపించి, దారి చూపుతాడు. "సత్యమునకు స్థంభమును ఆధారమునై''న (1తిమోతి 3:15) ఆయన సంఘం సరైన గ్రహింపుకు, ఆయన విధులను గూర్చిన బోధకు మూలాధారంగా ఉంది. మన పరుగుపందెంనుండి తొలగిపోకుండా, దినదినం ఎదుగుతూ ఉండాలనే ప్రోత్సాహం, హెచ్చరికలకు అదే ఆధారం (హెబ్రీ 10:25). మనలో ప్రతి ఒక్కరం ఈ విత్తువాని ఉపమానం అప్పుడప్పుడూ ధ్యానిస్తూ మనం దానిలోని ఏ వర్గానికి, లేక వర్గాలకు చెందినవారమో మనల్ని మనం పరీక్షించుకోవాలి. మంచి ఫలించే నేల అనే వర్గానికి చెందినవారంగా మనం ఉండాలి. "మంచి నేలలో పడిన విత్తనాలు ఎవరైతే సందేశాన్ని విని దానిద్వారా ఫలములు ఫలించేటంతవరకు దానిని తమ విధేయత గల హృదయంలో దాచుకొని ఉంటారో వారిని సూచిస్తున్నాయి (మత్తయి 13:23 - గుడ్ న్యూస్ బైబిల్). మనం ఎలాటి ఫలం ఫలించాలని దేవుడు కోరుతున్నాడు? "అయితే ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము'' (గలతీ 5:22,23). ఇతరులయెడల మంచి కార్యాలు, పరిచర్యలనే ఫలాలను కూడా దేవుడు మననుండి



కోరుతున్నాడు (తీతు 3:14; మత్తయి 5:14-16; 25:31-46). నిజంగా ఇవి ఎంత సుందరమైన, కోరదగిన ఫలాలు!

***ఆధ్యాత్మికంగా ఆరోగ్యంగా, బలంగా ఉండండి, ఎదగండి, బహుగా ఫలించండి!***



52 page blank